# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 26-2-2021 ₹ 15/-






# ఆదర్శ గృహం సమాజ హితం



గీటురాయి
వారపత్రిక

GEETURAI WEEKLY



Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in



సంపుటి 43 సంచిక: 9 హైదరాబాద్
శుక్రవారం 26 ఫిబ్రవరి 2021 రూ.15-00
13 రజబ్ 1442 హిజ్రీ


**తొలిగీటు**

బంధుత్వ హక్కు ఇవ్వడం వల్ల బంధువుల్లో ప్రేమానురాగాలు పెంపొందుతాయి. ధనం వికసిస్తుంది. ఆయుషులో శుభం ఉంటుంది.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**
సేల్స్ మేనేజర్
**ముహమ్మద్ యాసీన్, 9700255736**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




**ఫ్యామిలీ లైఫ్ ......16**

## లోపల...


| | | |
|---|---|---|
| పేరులోనేముంది | ...... | 05 |
| ఆదర్శ గృహం సమాజ హితం | ...... | 06 |
| విశ్వాసుల మాత సయ్యిదా ఆయిషా (ర.అ) – 34 | ...... | 10 |
| క్షమాపణ (కవిత) | ...... | 12 |
| నిజమైన ప్రేమ (కథ) | ...... | 13 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| కుటుంబ జీవితం | ...... | 20 |
| మూఢనమ్మకాల నిర్మూలనపై చట్టం రావాలి | ...... | 22 |
| ఆదర్శ కుటుంబం (కథ) | ...... | 24 |
| కుటుంబ బలం | ...... | 26 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| అభాగ్యానికి ఆనవాలు | ...... | 34 |


**క్లారిటీ ప్లీజ్ ..!**



తెలంగాణ గడ్డపైన
జగనొదిలిన బాణం
మతోన్మాద పార్టీలకు
పోయదుగద ప్రాణం!
అనుమానాలున్నాయి
ఇవ్వాలి నువ్వు క్లారిటీ
లేకుంటే జనం నుండి
ఉండదు అట చారిటీ!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# బంధమనే హారాన్ని తెంపేయకండి

- తహూరా సిద్దీఖా

కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమవతున్న నేటి తరుణంలో కుటుంబ విలువలను ప్రచారం చేసేందుకు జమాఅతె ఇస్లామీహింద్ ప్రచార ఉద్యమాన్ని చేపట్టడం నిజంగా అభినందనీయం. ఒకప్పుడు మన కుటుంబ వ్యవస్థ ఎంతో పటిష్టంగా ఉండేది. బంధువుల రాకపోకలతో ఇళ్లన్నీ కళకళలాడేవి. ఇంట్లో పెద్దవయస్సున్న తల్లిదండ్రులు ఉండేవారు. నాన్నమ్మ, అమ్మమ్మలు రాత్రిపూట మనువళ్లు, మనవరాళ్లకు నిద్రపుచ్చేందుకు కథలు చెప్పేవారు. జీవన నైపుణ్యాలను పెంపొందించే ఆ కథలు జీవితాంతం ఉపయోగ పడేవి. అత్తలు, పిన్నిలు పరస్పరం నవ్వులాటకు జ్యోక్స్ చెప్పుకునే వారు. పిల్లలను ఎంతో వాత్సల్యంతో చూసుకునేవారు. ఎవరో అన్నట్లు 'ఒకప్పుడు ఇల్లు ఇరుకుగా ఉన్నా బంధుత్వాలు విశాలంగా ఉండేవి. ఇప్పుడు ఇల్లు విశాలంగా ఉన్నా బంధుత్వ సంబంధాలు సంకుచితంగా మారాయి. కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమైపోయింది. పెద్ద పెద్ద చదువులు చదివినా కనిపించిన వారిని ఎలా చూసుకోవాలి, బంధుత్వ సంబంధాలు ఎలా నెరవేర్చాలి అనేది తెలియడం లేదు. ఒకప్పుడు పిల్లల నైతిక శిక్షణ కోసం తల్లిదండ్రులు, అమ్మమ్మ తాతయ్యలు ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. కానీ ఇప్పుడు అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు భారంగా మారిపోయారు. తల్లులు ఒకప్పుడు రెండేళ్ల పాటు తమ పసికందులకు పాలుపట్టేవారు. తమ సౌంద ర్యాన్ని కాపాడుకునేందుకు పిల్లలకు డబ్బాపాలు పడుతున్నారు. ఇక అత్తా-కోడళ్ల పోరు అప్పుడూ ఎప్పుడూ ఉండనే ఉంది. వదిన-ఆడబిడ్డలు, తోడికోడళ్ల మధ్య ఆధిపత్యపోరు ఉండేది. ఇక ఇప్పుడు ఆ సంబంధాలే మృగ్యమయ్యాయి. అన్నదమ్ముల మధ్య ఆప్యాయతలు కరువయ్యాయి. తమ హెూదా, అంతస్తు లను ఒకరిముందు ఒకరు బడాయి కోసం ప్రదర్శించుకుంటు న్నారు. ఎదుటివారిని చులకన చేసేందుకు లేని దర్పాన్ని ప్రదర్శి స్తున్నారు. డబ్బులు లేకపోతే రక్తసంబంధాలు కూడా దూరమై పోతున్నాయి. డబ్బున్నవాళ్లూ దూరపు చుట్టాలైన దగ్గరివారై పోతు న్నారు.

బంధుత్వ సంబంధాలను పెంపొందించే ఓ కథ సోషల్ మీడియాలో ప్రాచుర్యంలో ఉంది. తండ్రీ కొడుకులు మేడపైకి ఎక్కి గాలిపటం ఎగరేస్తున్నారు. గాలిపటాన్ని ఎలా ఎగరేయాలో తండ్రి పిల్లవాడికి నేర్పిస్తున్నాడు. గాలిపటం బాగా ఎత్తుకు వెళ్లాక, దారాన్ని కొడుకు చేతికి అందించాడు తండ్రి. కొడుకు ముఖం సంతోషంతో వెలిగిపోయింది. ఆ వెలుగులో తండ్రి మనసు ఉప్పొంగి పోయింది. కొంతసేపు దారాన్ని చేత్తో పట్టుకున్నాక కొడుకు తండ్రిని అడిగాడు. "నాన్నా దారంతో పట్టి ఉంచితేనే గాలిపటం అంత ఎత్తుకి ఎగిరిందే! దారాన్ని తెంపేస్తే ఇంకా ఎత్తుకు ఎగిరిపోతుంది కదా" అన్నాడు. తండ్రి నవ్వాడు. "దారాన్ని తెంపేద్దామా మరి?" అని అడిగాడు."తెంపేద్దాం నాన్నా" అన్నాడు కొడుకు ఎంతో ఉత్సాహంగా. ఇద్దరూ కలిసి దారాన్ని తెంపేసారు. "టప్' మని దారం తెగిపోగానే గాలిపటం ఇంకా పైకి ఎగిరిపోయింది. అంతలోనే దారి తప్పి అటూ ఇటూ కొట్టుకుంటూ కిందికి పడిపోవడం మొదలుపెట్టింది! చివరికి ఎవరి మేడ మీదనో కూలిపోయింది."ఇలా జరిగింది ఏంటి నాన్నా" అన్నాడు కొడుకు విచారంగా. దారం తెంపేస్తే గాలిపటం ఇంకా ఇంకా పైకి పోతుందనుకుంటే, కిందికొచ్చి పడిపోవడం ఆ పిల్లాడికి నిరుత్సాహం కలిగించింది. తండ్రివైపు బిక్కమొహం వేసుకుని చూశాడు. కొడుకును దగ్గరికి తీసుకున్నాడు తండ్రి. "గాలిపటానికి దారం ఉండేది. దానిని ఎగిరిపోనీయకుండా పట్టి ఉంచేందుకు కాదు. గాలి ఎక్కువైనా తక్కువైనా గాలిపటం తట్టుకుని నిలబడి, ఇంకా ఇంకా పైపైకి ఎగిరేలా చేసేందుకే" అని చెప్పాడు. మరో గాలిపటానికి దారం కట్టి ఎగరేసి కొడుకు చేతికి దారం అందించాడు. జీవితంలో కూడా మనకు కొన్నిసార్లు అనిపిస్తుంటుంది. 'కుటుంబం అనే బంధం లేకపోయి ఉంటే మనం ఇంకా ఏదో సాధించి ఉండేవాళ్లం అని!' నిజానికి కుటుంబం అందించిన ప్రేమ, సేవ, సౌకర్యాల వల్లనే మనం ఈ మాత్రమైనా నిలబడి ఉన్నామని గ్రహించాలి. బంధమనే దారాన్ని తెగనీయకండి. కలిసుంటే బలపడతాం. విడిపోతే పడిపోతామన్న విషయాన్ని గుర్తెరగాలి. చిన్నప్పుడు మనం ఐకమత్యమే మహాబలం అనే కథ చదువుకున్నాము. కథలో తన కొడుకులంతా కలిసి ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలను ఓ తండ్రి పుల్లల ద్వారా వివరిస్తాడు. విడి పుల్లను విరిచి వేయడం సులభం. కట్టగా ఉన్న పుల్లల్ని విరిచేయడం కష్టసాధ్యమైన పని. ఇదే పాఠాన్ని జమాఅతె ఇస్లామీహింద్ మరోసారి చెప్పేందుకు దేశవ్యాప్త కుటుంబ ఉద్యమానికి తెరలేపింది. బంధుత్వ సంబంధాల గురించి ఏ యూనివర్శిటీలోనో, మరే పాఠ్యాంశంలోనో మనకు దొరకదు. ఈ పనిని ధార్మిక సంస్థలే చేపట్టాల్సి ఉంది! ❖

## ఆలోచన

# పేరులోనేముంది?

**వసీం జాఫర్** పేరు విన్నారా? టెస్టు క్రికెట్‌లో స్పెషలిస్టుగా పేరు పొందిన గొప్ప క్రీడాకారుడు. డొమెస్టిక్ క్రికెట్ లో సాటిలేని యోధుడిగా పేరున్నవాడు. ఇటీవల ఆయన ఉత్తరాఖండ్ క్రికెట్ కోచ్ పదవికి రాజీనామా చేశాడు. ఆ వెంటనే మీడియాలో జాఫర్ పై అనేక ఆరోపణలు షికార్లు చేయడం ప్రారంభమయ్యింది. టీములో మతతత్వాన్ని తీసుకు వచ్చాడనే తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి.

క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఉత్తరాఖండ్ సెక్రటరీ మహీమ్ వర్మ, టీం మేనేజర్ నవనీత్ మిశ్రాలు జాఫర్‌పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. టీము సెలక్షన్‌లో జాఫర్ మతవివక్ష చూపిస్తున్నాడన్నారు. శుక్రవారం ప్రార్థనలకోసం ఒక మౌల్వీని డ్రస్సింగ్ రూముకు పిలిచాడని ఆరోపించారు.

ఈ ఆరోపణలన్నింటికి జాఫర్ సమాధానమిచ్చాడు. టీము కెప్టెన్ పదవికి జయ్ బిట్సా పేరు తాను ప్రతిపాదించానని ప్రకటించాడు. కాని క్రికెట్ అసోసియేషన్ స్వయంగా ఇక్బాల్ పేరును ప్రతిపాదించి ఎంపిక చేసుకున్నారనే విషయాన్ని బయటపెట్టాడు. శుక్రవారం ప్రార్థనలకు తాను ఏ మౌల్వీని ఆహ్వానించలేదని అన్నాడు. ఆ తర్వాత ఇక్బాల్ మాట్లాడుతూ జాఫర్ మౌల్వీని ఆహ్వానించలేదని, శుక్రవారం ప్రాక్టీసు తర్వాత ప్రార్థనల కోసం తానే మౌల్వీని పిలవడానికి పర్మిషన్ అడిగానని, జాఫర్ ఈ విషయంలో మేనేజర్ పర్మిషన్ తీసుకోవాలని చెప్పారని తెలియజేశాడు. అంతేకాదు, శుక్రవారం ప్రార్థనకు మేనేజర్ పర్మిషన్ తోనే మౌల్వీని పిలిచానని అన్నాడు. ఇది తప్పయినట్లయితే అసలు మేనేజర్ పర్మిషన్ ఎందుకిచ్చారని నిలదీశాడు. జాఫర్ తనపై ఆరోపణలకు జవాబిస్తూ ఉత్తరాఖండ్ క్రికెట్ అసోసియేషన్ సెలెక్టర్లు, సెక్రటరీ కలిసి యోగ్యత లేనివారిని ఎంపిక చేస్తుండడం వల్ల తాను రాజీనామా చేశానని తన రాజీనామాకు కారణం కూడా ప్రకటించాడు. జాఫర్ పై వచ్చిన మరో ఆరోపణ, ఉత్తరాఖండ్ టీము ఆడుతున్నప్పుడు శిక్కులకు సంబంధించిన నినాదం చేసేవారు. కాని ఇతర రాష్ట్రాల్లో ఆడుతున్నప్పుడు ఇలాంటి నినాదం బదులు 'గో ఉత్తరాఖండ్, కమాన్ ఉత్తరాఖండ్' వంటి నినాదాలు జాఫర్ ప్రోత్సహించాడు. దీనిపై కూడా గగ్గోలు చేశారు.

జాఫర్ ఒక లెజండ్‌గా పేరుపడిన క్రీడాకారుడు. అలాంటి క్రీడాకారుడైనా అతని పేరు చాలు అతను మతవివక్ష చూపిస్తాడనే ఆరోపణలతో అప్రతిష్ట పాలు చేయడానికి. ఇలాంటి వ్యాఖ్యలు, వ్యాఖ్యానాలు రాజకీయనాయకులు, మన బాలీవుడ్ ప్రముఖులు అప్పుడప్పుడు చేస్తూ ఉండడం మనం వింటూనే ఉన్నాం. ఇది కొత్తకాదు. దేశానికి ప్రాతినిధ్యం వహించిన ముస్లిం క్రికెటర్లు కూడా మంచి ముస్లిములుగా ఉండడానికి తీవ్రంగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. దేశంలో ముస్లిములు ఎదుర్కుంటున్న సమస్యలపై ముస్లిం క్రికెటర్లు నోరిప్పిన సందర్భం ఒక్కటి కూడా లేదు. మూకహత్యల విషయం కాని, హింసాకాండలు, అల్లర్లు జరిగినప్పుడు కాని, పౌరసత్వ సవరణ చట్టం విషయంలో కాని ఎవ్వరూ నోరిప్పలేదు. మంచి ముస్లిములుగా కొనసాగడానికే ప్రాముఖ్యం ఇచ్చారు. కాస్త గీత దాటిన వాడు ఇర్ఫాన్ పఠాన్. నిజానికి 2012 ఎన్నికల్లో బీజేపీ తరపున ఇర్ఫాన్ పఠాన్ నరేంద్రమోడీకి ప్రచారం కూడా చేశాడు. ఆ తర్వాత దేశంలో జరుగుతున్న సంఘటనలు చూసి చూసి, ఒక సందర్భంలో నోరిప్పాడు. అసహనాన్ని వ్యతిరేకిస్తూ ఒకసారి ట్వీట్ చేశాడు. అంతే ట్రోలింగ్ మొదలయ్యింది. ఇక అతను మంచి ముస్లిం హోదా కోల్పోయాడు. మరో క్రికెటర్ జహీర్ ఖాన్. ముస్లిం సమస్యలపై ఎన్నడూ పెదవి విప్పలేదు. జహీర్ ఖాన్ ప్రేమించిన అమ్మాయి పేరు సాగరికా. అంతే జహీర్ ఖాన్ పై లవ్ జిహాద్ ప్రచారం మొదలయ్యింది.


జాఫర్ విషయానికి వస్తే, అతనెప్పుడు, ఎన్నడూ ముస్లిముల సమస్యలపై మాట్లాడలేదు. మంచి ముస్లిం అనే బ్రాకెట్లలోనే కొనసాగడానికి ప్రయత్నించినవాడు. కాని ఎంత ప్రయత్నించినా అతని పేరు చాలు అతనిపై దుమ్మెత్తిపోయడానికి అనేది రుజువయ్యింది. అతనిపై మతవివక్ష చూపిస్తున్నాడనే ప్రచారం మొదలయ్యింది. విచిత్రమేమిటంటే, రైతు ఆందోళనలకు మద్దతిస్తూ అంతర్జాతీయ ప్రముఖులు ట్వీట్ చేసినప్పుడు పెద్ద పెద్ద క్రికెటర్లు వీరావేశంతో దేశభక్తి ప్రదర్శిస్తూ చేసిన ట్వీట్లు చాలా మంది చదివారు. కాని ఇప్పుడు తమ తోటివాడిపై, తమతో పాటు డ్రస్సింగ్ రూము పంచుకున్న క్రీడాకారుడిపై, వివాదరహితుడిగా పేరుపడిన వాడిపై ఘోరమైన ఆరోపణలు వస్తుంటే ఈ సోకాల్డ్ క్రికెటర్లు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. మనోజ్ తివారి, అనిల్ కుంబ్లే, ఇర్ఫాన్ పఠాన్, దొడ్డ గణేష్ తప్ప మరెవ్వరు జాఫర్‌కు మద్దతుగా ముందుకు రాలేదు.

క్రికెట్‌లోకి మతం ఎప్పుడు ప్రవేశించిందని ముహమ్మద్ కైఫ్ ఈ సందర్భంగా ప్రశ్నించడం గమనించదగిన విషయం. తాను దేశంలో అనేక చోట్ల ఆడానని, విదేశాల్లో కూడా ఆడానని, కాని ఎన్నడూ మత పరమైన విషయాల ప్రస్తావన వచ్చేది కాదని అన్నాడు. ఇలాంటి ఆరోపణలు ఎదుర్కున్న జాఫర్ చాలా బాధపడి ఉంటాడని అన్నాడు. సామూహిక నమాజు కోసం ఒక మౌల్వీని పిలిచారనే ఆరోపణ విషయం ప్రస్తావిస్తూ, డ్రస్సింగ్ రూములో ముస్లిం క్రీడాకారులు ఎవరికి వారు నమాజు చేసుకోవడంలో అభ్యంతరమేముంది? ఇంగ్లాండు టీములో గ్రాహం హిక్, మొయిన్ అలీ నమాజు చదువుకోడానికి తన క్రికెట్ కిట్ ను పక్కకు జరిపి సహకరించేవాడని కైఫ్ అన్నాడు.

వసీం జాఫర్ వివాదం వల్ల తెలుస్తున్నదేమిటి? సాధారణంగా క్రికెట్ అసోసియేషన్ వ్యవహారాల్లో కోచ్, సెక్రటరీల మధ్య వివాదాలు రావచ్చు. ఒకరంటే ఒకరికి పడకపోవచ్చు. కాని అందులో ఒకడు ముస్లిం అయితే మతవివక్ష చూపిస్తున్నాడంటూ మతం రంగు పులిమే అవకాశాలు ఇప్పుడున్నాయి. ఇది క్రికెట్ అసోసియేషన్‌కు మాత్రమే పరిమితమైన విషయం కాదు. మంచి ముస్లిముగా ట్యాగ్ కొనసాగించడానికి ప్రతి ముస్లిం ఇక్కడ ప్రయత్నిస్తూ ఉండకపోతే ట్రోల్ సైన్యాల దాడులు తప్పవు. మంచి ముస్లింగా ఉన్నంత మాత్రాన, ముస్లిం సమస్యలపై నోరెత్తకుండా తన మానాన తాను బతికినంత మాత్రాన హమ్మయ్య పర్వాలేదు అనుకోడానికి ఏం లేదు. మతోన్మాది అనే ఆరోపణ ఎప్పుడైనా ఏ క్షణాన్నయినా రావచ్చు. ఆ ఆరోపణలు చేసేవారిపై ఎలాంటి చర్యలు ఉండవు.

అంతా పేరులోనే ఉందిప్పుడు.

అబ్దుల్ వాహెద్



# ఆదర్శ గృహం సమాజ హితం

హామిద్ ముహమ్మద్ ఖాన్
అమీరె హల్ఖా, తెలంగాణ

**ఆదర్శ కుటుంబాల** నిర్మాణమే నేడు సమాజానికి దేశానికి అవసరం. కుటుంబంలో శాంతిసంతోషాలుంటేనే సమాజం బాగుంటుంది.

కుటుంబ జీవనానికి ఇస్లాం చాలా ప్రాముఖ్యాన్నిచ్చింది. మనిషి ఒంటరిగా ఉండరాదు. అల్లాహ్ అన్నింటిని జంటగా సృష్టించాడు. మీ నుంచే మీ భార్యలను సృష్టించానని చెప్పాడు. వివాహం నా పద్ధతి, నా పద్ధతి పాటించని వాడు నా వాడు కాదన్నారు ప్రవక్త ముహమ్మద్ (స). ఇందులో సామాజిక సూత్రం దాగి ఉంది. మనిషికి నిద్రాహారాలు ఎలా తప్పనిసరి అవసరాలో అదేవిధమైనది లైంగిక వాంఛ కూడా. ఏ విధంగా ఆహారం ధర్మబద్ధమైన పద్ధతుల్లో సంపాదించు కోవాలో అదే విధంగా లైంగిక వాంఛ కూడా ధర్మబద్ధమైన పద్ధతిలో తీర్చుకోవడం మాత్రమే సమ్మతం. ఆ పద్ధతి వివాహం మాత్రమే. వివాహం వల్ల మనిషి గౌరవమర్యాదలకు భద్రత లభిస్తుంది. గౌరవప్రదమైన జీవితాన్ని, ధర్మబద్ధమైన జీవితాన్ని గడపగలడు. ప్రతి వ్యక్తి తన తర్వాత, తన వల్ల జన్మించే సంతానానికి తన పేరు ఇవ్వాలి, తన రక్షణ ఇవ్వాలి. తన ఆశ్రయం ఇవ్వాలి. ఇవన్నీ వివాహ వ్యవస్థ బలంగా ఉన్నప్పుడే సాధ్యం. పిల్లలకు తల్లితండ్రి ఇద్దరు లభిస్తారు. ప్రతి మనిషి తన వంశాన్ని, అంటే తన వల్ల జన్మించిన సంతానానికి బాధ్యత వహించే ఏర్పాటు వివాహం. అంటే ప్రతి మనిషి తన సంతానం పట్ల తన బాధ్యతలు నిర్వర్తించడం, కుటుంబాన్ని కాపాడడం అనేది వివాహ వ్యవస్థ వల్ల మాత్రమే సాధ్యమవుతుంది. పిల్లల పోషణ, వారి విద్యాశిక్షణలు, వారి నైతిక

క్రమశిక్షణ, ఆధ్యాత్మికంగా తర్ఫీదు, సామాజిక, ధార్మిక, ఆధ్యాత్మిక, నైతిక ప్రమాణాలను పిల్లల్లో పెంపొందించడం ఇవన్నీ కుటుంబంలోనే సాధ్యమవుతాయి. చక్కని కుటుంబ వాతావరణంలో, కుటుంబ విలువలు, సామాజిక విలువలు పుణికిపుచ్చుకున్న పిల్లలు సత్యమార్గాన నడుస్తారు. ఆదర్శ కుటుంబాలు ఆదర్శ పౌరులను సమాజానికి అందిస్తాయి.

కాని -

ఆధునిక ఆలోచనాసరళి వివాహ వ్యవస్థ ప్రాముఖ్యాన్ని తగ్గించింది. నా శరీరం నా ఇష్టం అనే వైఖరిని ప్రోత్సహించింది. ఈ వైఖరి పురుషులకు అవకాశాలు ఇచ్చింది. మహిళలను ఇబ్బంది పాలు చేసింది. అబలను ఆట వస్తువుగా మార్చేసింది. విలాసవస్తువు స్థాయికి దిగజార్చింది. కలిసి ఉండడం, లివ్ ఇన్ రిలేషన్లు పెరుగుతున్నాయి. ఇలాంటి సంబంధాల్లో పురుషుడు తన బాధ్యతలను దులిపేసుకుని వెళ్ళిపోతే స్త్రీ ఒంటరి అయిపోతుంది. ఒంటరి తల్లిగా మిగిలిపోతుంది. నా శరీరం నా ఇష్టం అనే ధోరణి విపరీతంగా ఉన్న పాశ్చాత్య సమాజాలు ఈ ధోరణి ఫలితాలను అనుభవిస్తున్నాయి. అమెరికాలో పుట్టే పిల్లల్లో దాదాపు 40 శాతం వైవాహికేతర సంబంధాల వల్ల జన్మిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితి సమాజానికి నష్టం కలిగించే పరిస్థితి. దీనివల్ల పిల్లలకు తండ్రి ప్రేమ లభించదు. తండ్రి ఎవరో తెలియని పిల్లలు పెరుగుతారు. కుటుంబ వాతావరణం అంటే ఏమిటో వారికి తెలియదు. ఒంటరితనాన్ని చూస్తూ పెరుగుతారు. కుటుంబ విలువలు లేకపోతే సమాజంలోను సామాజిక విలువలు మిగలవు. విలువలు ఎంతగా దిగజారాయో లాక్‌డౌన్ లో తలెత్తిన అనేక పరిస్థితుల్లో స్పష్టంగా అర్థమయ్యింది. ఇంట్లో ఉండండి క్షేమంగా ఉండండి అని కరోనా నుంచి కాపాడుకోవాలని చెప్పారు. కాని కుటుంబసభ్యులు అందరూ ఇంట్లో ఉన్నప్పుడు గృహహింస కేసులు గణనీయంగా పెరిగాయి. దీనికి దిగజారిన కుటుంబ విలువలే కారణం.

అందుకే ఇస్లాం కుటుంబవ్యవస్థకు అత్యధిక ప్రాముఖ్యం ఇచ్చింది. జమాఅతె ఇస్లామీ హింద్ కుటుంబాలను పటిష్టం చేయాలని పిలుపునిచ్చింది. పటిష్ట కుటుంబం పటిష్ట సమాజం పేరుతో ఉద్యమాన్ని చేపట్టింది. కొత్తతరం సామాజిక విలువలను గౌరవించేదిగా ఉండాలన్నది జమాఅత్ ఉద్దేశ్యం. స్త్రీలను గౌరవించే వాతావరణం సమాజంలో ఏర్పడాలంటే, కుటుంబం ఆదర్శకుటుంబంగా ఉండాలి. పిల్లల విద్యాబోధన, నైతిక శిక్షణ ఒక బాధ్యతగా కొనసాగాలి. సామాజిక చైతన్యం కలిగిన, విశ్వసనీయులైన, బౌద్ధిక, శారీరక శక్తిసామర్థ్యాలు ఉన్న, చురుకుదనం తొణికిసలాడే, పవిత్రమైన వ్యక్తిత్వం కలిగిన భావితరాలను ఆదర్శ కుటుంబాలు మాత్రమే సమాజానికి అందించగలవు. కుటుంబాలు పతనమైతే మానసిక బలహీనతలు, నైతిక ప్రమాణాల అవగాహన లేనివారు, నేను నా ఇష్టం అనుకునేవారు మాత్రమే సమాజానికి లభిస్తారు. ఇలాంటి పరిస్థితి ఉండరాదు.

ఆదర్శ కుటుంబం మాత్రమే ఈ సమస్యలకు పరిష్కారం. అందుకే జమాఅతె ఇస్లామీ హింద్ ఆదర్శ కుటుంబాల నిర్మాణమే నేటి అవసరంగా భావిస్తోంది.

ఆదర్శ కుటుంబం గురించి మాట్లాడుకుంటున్నప్పుడు, ఆదర్శ కుటుంబం ఎలా ఏర్పడుతుంది? అనేది ప్రధానమైన ప్రశ్న.

ఇంటి బాహ్యరూపం ఆదర్శంగా ఉండాలి.

ఇంటి అంతర్గత లక్షణాలు ఆదర్శంగా ఉండాలి. ఇవి రెండూ అవసరం.

బాహ్యరూపం ఆదర్శంగా ఉండడం అంటే ఇల్లు పరిశుభ్రంగా ఉండాలి. ఇది కుటుంబ సభ్యులు అందరి బాధ్యత? ఇది భార్యాభర్తలిద్దరి బాధ్యత మాత్రమే కాదు, పిల్లల్లో ఆడ మగ అందరి బాధ్యతగా ఇంటి వాతావరణం ఉండాలి. ఆడపిల్లలు మాత్రమే కొన్ని పనులు చేయాలి, మగపిల్లలు కొన్ని పనులు చేయరాదనే పెంపకం సరయింది కాదు. ఇంటి పనులు అందరూ పంచుకోవాలి. ఇలా చేసినప్పుడు, ఆడపిల్లల పట్ల మగపిల్లల్లో చులకనభావం వంటివి ఏర్పడవు. అందరూ సమానమే అనే విలువలు పెరుగుతాయి. ఇలాంటి విలువలను ప్రవక్త ముహమ్మద్ (స) తన జీవితంలో ఆచరించి చూపించారు.

ప్రవక్త ముహమ్మద్ (స) ఇంటి పనుల్లో సహాయం చేసేవారు. దుస్తులకు మాసికలు ఆయనే వేసుకునేవారు. పాదరక్షలు తెగిపోతే ఆయనే బాగు చేసుకునేవారు. పాలు పితికేవారు, ఇల్లు శుభ్రం చేసేవారు. ఇలాంటి వాతావరణం కుటుంబాల్లో ఉండాలి. అలాంటి వాతావరణంలో పెరిగిన పిల్లలు ఆడ మగ సమానమని భావిస్తారు. ఏ పనిని తక్కువగా చూడరు.

స్త్రీలను గౌరవించడం నేర్చుకుంటారు. ప్రవక్త ముహమ్మద్ (స) పద్ధతి ఇది.

మరో ముఖ్యమైన విషయం, ఆదర్శ కుటుంబం అంటే ఆడంబరాల కుటుంబం కాదు. ఖర్చుల్లో సమతుల్యాన్ని పాటించాలి. దుబారా ఖర్చులను నివారించాలి. ఇంటికి అవసరమైన వస్తువులన్నీ ఉండాలి, కాని అవసరం లేని, కేవలం ఆడంబరం కోసం, ప్రదర్శన కోసం కొనే వస్తువులు ఉండరాదు. ఖర్చుల్లో మితం పాటించడం పిల్లలకు నిరాడంబర జీవితాన్ని నేర్పుతుంది. ఖర్చుల్లో మితం పాటించడం వల్ల సమాజంలో అవసరమున్న వారిని ఆదుకోవచ్చు. అవసరం ఉన్నవారిని, పేదలను ఆదుకోవాలని ఇస్లాం బోధిస్తుంది. డబ్బు ధర్మ మార్గాన సంపాదించడం ఎంత ముఖ్యమో, ధర్మమార్గాన మాత్రమే ఖర్చు చేయడం కూడా అంతే ముఖ్యం. ఈ గొప్ప విలువను పిల్లలు చిన్నప్పటి నుంచి అలవరచుకునేలా కుటుంబ వాతావరణం ఉండాలి. అనవసరపు ఖర్చులు, ఆడంబరాల వల్ల లభించేది సంతోషం కాదని, అవసరమున్న వారిని ఆదుకోవడంలోనే సంతోషం ఉందని, ఇదే ధర్మబద్ధమైన జీవితమని చిన్నప్పటి నుంచి చూసి నేర్చుకున్న పిల్లలు అద్భుతమైన సామాజిక బాధ్యత కలిగిన పిల్లలుగా సమాజానికి గొప్ప బలం అవుతారు.

ఆదర్శకుటుంబం అంటే కుటుంబ సభ్యుల మధ్య సుహృద్భావ సంబంధాలు ఉండడం. భార్యాభర్తల మధ్య, పిల్లల మధ్య సుహృద్భావ సంబంధాలు ఎలా ఏర్పడతాయంటే, ప్రతి ఒక్కరు తన బాధ్యతలేమిటో గుర్తించడం, హక్కులను నిర్వర్తించడం, అవసరమైతే తన హక్కులను త్యాగం చేయడం వంటి లక్షణాల వల్ల సుహృద్భావ సంబంధాలు ఏర్పడతాయి. కుటుంబ సభ్యులను ప్రేమించేవారు, సమాజంలోను ప్రేమభరిత వాతావరణాన్ని కోరుతారు. కుటుంబ విలువలను కాపాడేవారు సమాజంలోను విలువలను కాపాడుతారు. కుటుంబం అంటే భార్యాభర్తలు, పిల్లలు మాత్రమే కాదు, ఇతర బంధువుల పట్ల కూడా ప్రేమాభిమానాలు కలిగి ఉండాలి. బంధువుల హక్కులను గౌరవించాలి. అత్తా, కోడలు, తాత, నాయనమ్మ, బాబాయి, పినతల్లి, మేనత్త, మేనమామ, వారి పిల్లలు అందరితోను చక్కని సంబంధాలు కలిగి ఉండాలి. అవసరమైతే వారి కోసం తన హక్కును వదులుకుని ఆదుకోవాలి. బంధువుల గురించి కుటుంబంలో చెడుగా మాట్లాడుకోరాదు. వారిలో ఏవైనా లోపాలున్న వాటిని పిల్లల ముందు ప్రస్తావించడం, పిల్లల మనస్సులో వారి పట్ల వ్యతిరేకత పెంచడం సరయిన పద్ధతి కాదు. బంధుత్వ సంబంధాలను తెంచుకోవద్దని ఇస్లాం హెచ్చరిస్తుంది.

కుటుంబంలో ముఖ్యమైన వారు భార్యాభర్తలే. వారిద్దరి మధ్య సుహృద్భావ సంబంధాలు చాలా ముఖ్యం. భార్యాభర్తలు ఒకరికి ఒకరు దుస్తుల వంటివారని ఇస్లాం చెబుతుంది. ఈ పోలిక పరిశీలించదగింది. అద్భుతమైన పోలికతో భార్యాభర్తల మధ్య ఎలాంటి బంధం ఉండాలో దివ్య ఖుర్ఆన్ ప్రకటించింది.

దుస్తులు మనిషికి అత్యంత సమీపంగా ఉంటాయి. భార్యాభర్తలు కూడా ఒకరికొకరు అదేమాదిరి అత్యంత సమీపంగా ఉండాలి. భార్యకు భర్తకన్నా, భర్తకు భార్య కన్నా సమీపంగా ఉండేవారు మరెవ్వరు ఉండరు. సాన్నిహిత్యాన్ని సూచించడానికి ఇంతకు మించిన పోలిక లేదు. దుస్తులతో మనిషికి దృఢమైన సంబంధం ఉంది. మనిషి జీవించినంత కాలం మనిషిని అంటిపెట్టుకుని ఉండే దృఢమైన సంబంధం అది. భార్యాభర్తల మధ్య కూడా ఇలాంటి సంబంధమే కోరుతుంది ఇస్లాం. అలాగే దుస్తులు మనిషి మానమర్యాదలను కాపాడతాయి. భార్యాభర్తలు కూడా ఒకరి మానమర్యాదలను మరొకరు కాపాడతారు. అందుకే ఇస్లాం భార్యను ముహ్సినా, అని భర్తను ముహ్సిన్ అని పేర్కొంది. అంటే అర్థం ఒకరికి ఒకరు రక్షణ కల్పించే కోట వంటి వారని. దుస్తులు మనిషికి వాతావరణం నుంచి రక్షణ కల్పిస్తాయి. అదేవిధంగా భార్యాభర్తలు కూడా ఒకరికి ఒకరు రక్షణ కల్పించాలి. ఒకరికి ఒకరు రక్షణ కవచంగా ఉండాలి. ఒకరినొకరు ఆదుకోవాలి. ఆలంబన కావాలి. చివరిగా దుస్తులు మనిషికి అందాన్నిస్తాయి. భార్యాభర్తలు ఒకరికి ఒకరు అందం కావాలి. ఇలాంటి చక్కని సంబంధం ఉన్నప్పుడే కుటుంబ వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది.

ఒకసారి హజ్రత్ ఉమర్ (రజి) ఇంటికి ఒక వ్యక్తి కలవడానికి వచ్చాడు. అప్పుడు ఉమర్ (రజి) ఇంట్లో ఆయన భార్య ఏదో విషయమై ఉమర్ (రజి)ను మందలిస్తూ, కోపంగా మాట్లాడుతున్న మాటలు ఆ వ్యక్తి విన్నాడు. ఆ వ్యక్తి సరయిన సమయం కాదనుకుని వెనుతిరిగి వెళ్ళిపోయాడు. ఉమర్ (రజి) అంటే అందరికీ సింహస్వప్నం. అలాంటి వ్యక్తి బయట పులి, ఇంట్లో పిల్లిలా ఉన్నారేమిటి అనుకున్నాడు. తర్వాత ఒకసారి ఉమర్ (రజి) కలిసినప్పుడు ఇదే విషయం అడిగేశాడు. ఉమర్ (రజి) జవాబిస్తూ, ఆమె నా భార్య, నా పిల్లలకు

తల్లి. నా కోసం నా పిల్లల కోసం పొద్దంతా ఇంట్లో కష్టపడుతుంది. మా అవసరాలు చూస్తుంది. ఆమె ఎప్పుడైనా విసిగి కోపంతో ఏమన్నా నేను భరించడంలో తప్పేముంది అన్నారు.

ప్రవక్త ముహమ్మద్(స) జీవితంలో భార్యాభర్తల అన్యోన్యతను తెలిపే అనేక సంఘటనలున్నాయి. ఒకసారి ప్రవక్త ముహమ్మద్(స), భార్య హజ్రత్ ఆయేషా(రజి) ఇద్దరు పరుగు పందెం వేసుకున్నారు. హజ్రత్ ఆయిషా (రజి) గెలిచారు. ప్రవక్త ఓటమి ఒప్పుకుని, నువ్వే గెలిచావన్నారు. కొన్నేళ్ళ తర్వాత ఇద్దరు మరోసారి పరుగుపందెంలో ఎవరు గెలుస్తారో చూద్దామనుకున్నారు. కాని, అప్పటికి హజ్రత్ ఆయిషా (రజి), విశ్వాసుల మాతృమూర్తి, కాస్త లావయ్యారు. అందువల్ల ఈ సారి ఆమె గతంలో మాదిరి పరుగెత్తలేకపోయారు. ప్రవక్త గెలిచారు. ప్రవక్త (స) ఆమెతో పరిహాసమాడుతూ చూశావా.. అప్పటి ఓటమికి ప్రతీకారం తీర్చేసుకున్నానని నవ్వారు.

ఆదర్శకుటుంబంలో కావలసింది ఒకరినొకరు అర్థం చేసుకోవడం. చిన్నచిన్న లోపాలు అందరిలోను ఉంటాయి. ఎవరు పర్ఫెక్ట్ కాదు. లోపాలను చూసీచూడనట్లు వదిలేయాలి. సుగుణాలను దృష్టిలో ఉంచుకోవాలి. అలాగే, భార్య పుట్టింటి వారిని భర్త తక్కువగా చూడడం, లేదా భర్త బంధువులను తల్లిదండ్రులను భార్య పట్టించుకోకపోవడం వంటివి కుటుంబాల్లో కలతలకు కారణమవుతాయి.

ఒక వృద్ధ దంపతుల గురించి కథ చాలా ఆసక్తికరమైనది. వృద్ధాప్యంలో భర్త భార్యను నేనెప్పుడైనా నీతో కోపంగా, పరుషంగా మాట్లాడానా అని అడిగాడు. భార్య చిరునవ్వుతో జవాబిస్తూ, ఎప్పుడూ లేదని చెప్పింది. ఎప్పుడైనా నా మీద కోపం వచ్చిందా అని అడిగితే, వచ్చినా పెద్దగా పట్టించుకోలేదు అని జవాబిచ్చింది. ఆ ఇంట్లో ఆమె స్వంతంగా దాచుకున్న ఒక పెట్టె ఉంది. ఆ పెట్టెను భర్త ముట్టుకోకుండా దాచుకునేది. ఆ పెట్టెలో ఏముందో ఇప్పుడైనా చూపించు అన్నాడు భర్త. సరే అని తెరిచి చూపించింది. అందులో గుడ్డలతో కుట్టిన ఒక బొమ్మ కొన్ని డబ్బులున్నాయి. ఇవేంటని అడిగాడు భర్త. నేను పెళ్ళి చేసుకుని పుట్టింటి నుంచి వీడ్కోలు తీసుకుని వస్తున్నప్పుడు మా నాయనమ్మ నాకో మాట చెప్పింది. భర్త మీద కోపం వస్తే ఇలా గుడ్డముక్కలతో బొమ్మ చేసుకో అని చెప్పింది. అదే చేశానంది. భర్త సంతోషంగా, అయితే ఇన్ని సంవత్సాల సంసారంలో నీకు నా మీద ఒక్కసారి మాత్రమే కోపం వచ్చిందన్నమాట అన్నాడు. భార్య ఆ పెట్టెలోని నోట్ల కట్ట తీసి చూపిస్తూ, మిగిలిన బొమ్మలు అమ్మేస్తే ఈ డబ్బులు వచ్చాయంది.

కోపతాపాలను అదుపు చేసుకోవడం, ఒకరినొకరు అర్థం చేసుకోవడం దాంపత్యంలో చాలా అవసరం. అప్పుడే పిల్లలపై శ్రద్ధ చూపించగలరు. పిల్లలపై అనవసరంగా కోప్పడడం లేకుండా వారి విద్యాశిక్షణలపై దృష్టి పెట్టగలరు. పిల్లల పెంపకంలోను పిల్లల వల్ల జరిగే చిన్న చిన్న తప్పులకు కూడా అగ్గిమీద గుగ్గిలంలా మండిపడరాదు. వారిని సంస్కరించడానికి వివేకంతో వ్యవహరించాలి.

న్యాయబద్ధంగా వ్యవహరించడం ఆదర్శ కుటుంబానికి ఎంతో అవసరం. చాలా మంది బయట స్నేహితులకు చాలా ఖర్చు చేస్తారు. కాని ఇంటి ఖర్చులకు పిసినారుల్లా వ్యవహరిస్తారు. ఇల్లు నడిపే ఇల్లాలు ఇబ్బంది పడుతుంది. ఇలాంటి పరిస్థితి ఉండరాదు. అలాగే కొందరు భార్యలు అనవసర ఖర్చులతో, షాపింగులతో దుబారా చేయడం, మరింత డబ్బు కోసం భర్తను ఇబ్బంది పెట్టడంవంటి పరిస్థితి కూడా ఉండరాదు. ఖర్చుల్లో సమతుల్యాన్ని పాటించాలి. సంపాదన పిల్లల కోసం, కుటుంబంకోసం, ధర్మమార్గాన ఖర్చు చేయాలి. ఎలా సంపాదించారనే కాదు, ఎలా ఖర్చుపెట్టారనేది కూడా పరలోకంలో జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. చిన్న చిన్న కోర్కెలు తీర్చడం లేదని భర్తను సాధించే భార్యలు, కూరలో ఉప్పు లేదని భార్యపై మండిపడే భర్తలు గ్రహించవలసిన ముఖ్యమైన విషయమేమిటంటే, అన్యోన్యతలో ఉన్న ఆనందం మరెందులోను లేదు. చిన్న చిన్న విషయాలను పట్టించుకోకుండా ఉండడమే దీనికి కావలసింది.

ఇంటి వాతావరణం పవిత్రంగా ఉండేలా చూసుకోవాలి. టీవీలో వచ్చే సీరియళ్ళలో ఇప్పుడు కుట్రలు కుతంత్రాలు చేసే మహిళా పాత్రలు, అక్రమ సంబంధాలు, సినిమాల్లో అశ్లీల సన్నివేశాలు, అసభ్య సంభాషణలు వీటన్నింటికి ఇల్లు దూరంగా ఉండాలి. దుర్భాషలు ఇంట్లో వినిపించరాదు. భార్యపై కోపంతో ఎగిరిపడుతూ తిట్లు అందుకునే భర్తలు పిల్లలపై ఎలాంటి ప్రభావం వేస్తున్నారో తెలుసుకోవాలి. భర్తపై అత్తగారికి చాడీలు చెప్పే భార్యలు కూడా తమ వ్యవహారశైలిని పునరాలోచించుకోవాలి.

ఆదర్శ కుటుంబం అనేది ఒక బాధ్యత. ఆ బాధ్యతను నిర్వర్తించడానికి, ఆదర్శకుటుంబాన్ని తీర్చిదిద్దుకోడానికి అందరూ ప్రయత్నించాలి. ✤

34

# విశ్వాసుల మాత సయ్యిదా ఆయిషా (رضي الله عنها)

ఉర్దూ మూలం : అల్లామా సయ్యిద్ సులైమాన్ నద్వి (రహ్మ) | తెలుగు రూపం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

## మరణం

తన కుటీరంలో దైవప్రవక్త(సఅసం) పవిత్ర సమాధి దగ్గర తనను ఖననం చేయరాదని మరణ శాసనం చేశారు సయ్యిదా ఆయిషా(ర). ఎందుకంటే తాను ఒక నేరం చేశానన్నారు. తనను ఇతర ప్రవక్త సతీమణులందరి వలెనే జన్నతుల్ బఖీలో ఖననం చేయాలని తాకీదు చేశారు. తన అంత్యక్రియలు రాత్రిపూట జరపండి అని కూడా సూచించారు *(సహీహ్ బుఖారీ-అంత్యక్రియల ప్రకరణం, హ.నెం.1391, 7327; ముస్తద్రక్ హాకిమ్- 4/6)*. 'అమ్మా! మీరు దైవప్రవక్త(స), అబూబకర్ (రజి)లతోపాటు ఇక్కడే సమాధి చేయబడితే బాగుంటుందేమో!' అని ఎవరో చెప్పగా, "ఒకవేళ అలా జరిగితే, పూర్వం చేసుకున్న ఆచరణలు పోతుంటాయి. కొత్తగా ఆచరణ చేసుకోవాలా?" అన్నారు *(ముఅత్తా ఇమామ్ ముహమ్మద్-2/481)*. అది హిజ్రీ 58వ సంవత్సరం, రమజాన్ నెల 17వ తేదీ. క్రీ.శ. 678 జూన్ నెల 13వ తేదీ. విత్ర్ నమాజ్ తర్వాత రాత్రివేళ పరమపదించారు. అక్కడున్న వారి ఏడ్పులు విని అన్సార్ మహిళలు ఇండ్లల్లో నుంచి పరుగులు తీస్తూ వచ్చారు. రాత్రివేళ జనాజా తీసుకుపోతున్నప్పుడు, ఆ ప్రాంతమంతా జనంతో కిక్కిరిసిపోయింది. రాత్రివేళ ఎవరి జనాజా నమాజ్‌లో కూడా మదీనాలో అంత భారీ జన సమూహం కనిపించలేదని అనబడుతోంది. స్త్రీల రాకపోకలను చూసినప్పుడు, అది పండుగ దినపు జన సందోహమా! అన్న భ్రాంతి కలిగిందని కొన్ని ఉల్లేఖనాలలో ఉంది *(తబఖాత్ ఇబ్నెసాద్-8/75)*. అక్కడి స్త్రీల ఏడ్పులు, హాహాకారాలను చూసి సయ్యిదా ఉమ్మె సలమా (ర.అ) ఇలా అన్నారు: "ఆయిషా (ర.అ)కు స్వర్గం వాజిబ్ (తప్పనిసరి). ఆమె దైవప్రవక్త (స)కు ప్రాణ సఖి" (హాకిమ్). ముస్నదె తియాలిసీలోని ఉల్లేఖనం ప్రకారం ఆమె ఇలా అన్నారు: "అల్లాహ్ ఆమెను కరుణించు గాక! ఆమె తన తండ్రి ఒక్కరిని మినహాయిస్తే, మిగిలిన వారిలో దైవప్రవక్త(స)కు అందరికన్నా ఎక్కువ ప్రియతమురాలు." *(ముస్నద్ తియాలిసీ- 1613)*

ఆ రోజుల్లో మహనీయ అబూ హురైరా (రజి) మదీనాకు తాత్కాలిక పురపాలకునిగా ఉన్నారు. ఆయనే నమాజె జనాజాకు సారథ్యం వహించారు. ఖాసిమ్ బిన్ ముహమ్మద్ బిన్ అబీ బకర్, అన్న కొడుకులు, అక్క కొడుకులు - వీరంతా కలసి ఆమె భౌతిక కాయాన్ని సమాధిలో దించారు (ముస్తద్రక్

హాకిమ్- 4/ 13,14). ఆమె చేసిన మరణ శాసనం ప్రకారమే జన్నతుల్ బఖీలో ఖననం చేయబడ్డారు. ఆ రోజు మదీనా ప్రళయాన్ని తలపించింది. "ఈ రోజు ప్రవక్త(స) పవిత్ర నిలయంలోని మరో దీపం ఆరిపోయింది" అంటూ ప్రజలు దుఃఖంతో విలపించారు. మస్రూఖ్ తాబయి (రహ్మ) "నాకే గనక ఒక విషయం గురించిన భయం లేకుండా ఉంటే, నేను ఉమ్ముల్ మోమినీన్ ఆయిషా(ర.అ) కోసం శోకాన్ని పాటించే ఒక మండలిని స్థాపించి ఉండేవాణ్ణి" (తబఖాత్ ఇబ్నె సాద్- 8/78) అన్నారు. సయ్యిదా ఆయిషా(ర.అ) మరణ శోకాన్ని మదీనా వాసులు ఎంతగా పాటించారు? అని జనులు ఒక మదీనా వాసిని ప్రశ్నించగా, "ఎవరెవరికయితే ఆమె తల్లిగా ఉందో వారంతా (అంటే ముస్లింలంతా) శోక సంతప్త హృదయంతో విలపించారు" అని అతను సమాధాన మిచ్చాడు *(తబఖాత్ ఇబ్నె సాద్- 8/78).*

సయ్యిదా ఆయిషా(ర.అ) తన ఆస్తులు కొన్నింటిని విడిచి పోయారు. వాటిలో ఒక పొలం కూడా ఉంది. అది ఆమె అక్క సయ్యిదా అస్మా(ర.అ) వాటాలోకి వచ్చింది. మహనీయ అమీర్ ముఆవియా (ర.అ) శుభం కొరకు దానిని ఒక లక్ష దిర్హములకు కొనుగోలు చేశారు. ఆ భారీ మొత్తాన్ని సయ్యిదా అస్మా (ర.అ) ఏం చేశారో మీకు తెలుసా?... ఆ మూల్యాన్ని ఆమె తన సమీప బంధువులకు పంచిపెట్టారు *(సహీహ్ బుఖారీ- కానుకల ప్రకరణం).*

## దత్తత

సయ్యిదా ఆయిషా(ర.అ)కు సంతానం కలగలేదు. (సుననె అబీ దావూద్- హ.నెం.4970)

అయితే ఆమె తన పూర్తి జీవిత కాలంలో ఎన్నడూ ఒక్కసారి కూడా తన విధివ్రాతపై నిష్ఠూరంగా మాట్లాడిన దాఖలా లేదు. అరేబియాలోని మర్యాదస్తులు తమ పేరుతోపాటు తమ సంతానం పేరు మీద 'కునీయత్' పెట్టుకోవటం ఆనవాయి తీగా ఉండేది. వారు తమ అసలు పేరుతో కాకుండా కునీయత్‌తోనే పిలువబడే వారు. ఒకసారి సయ్యిదా ఆయిషా (ర.అ), "దైవప్రవక్తా! మీ భార్యలంతా తమ (మొదటి భర్తల ద్వారా కలిగిన) కుమారుల పేరుతో తమ తమ కునీయత్ లను పెట్టుకున్నారు. మరి నేను ఎవరి పేరుతో పెట్టుకోను?" అని విన్నవించుకోగా, "నువ్వు కూడా నీ కుమారుడగు అబ్దుల్లాహ్ పేరు మీద పెట్టుకో" అని ప్రవక్త మహ నీయులు (సఅసం) సలహా ఇచ్చారు *(సుననె అబీ దావూద్- కితాబుల్ అదబ్, హ.నెం.4970).* ఇబ్నుల్ అరబీ ఇక్కడే సంశయంలో పడిపోయారు- సయ్యిదా ఆయిషా (ర.అ)కు నెలలు నిండని ఒక అబ్బాయి పుట్టగానే చనిపోయాడనీ, అతని పేరే అబ్దుల్లాహ్ అనీ ఆయన పేర్కొన్నారు *(జుర్‌ఖానీ- షరహ్ ముఅత్తా- 3/269).* కాని ఈ ఉల్లేఖనం ఏ మాత్రం ఎన్నదగి నది కాదు. సనదు రీత్యా ఇది ఎంతో బలహీనమైనది. సయ్యిదా ఆయిషా (ర.అ)కు సంతాన భాగ్యం ప్రాప్తం కాలేదనే హదీసులంటున్నాయి *(ముస్నద్ అహ్మద్).*

ఇక్కడ ప్రస్తావనకు వచ్చిన అబ్దుల్లాహ్ ఎవరో కాదు, ఆయన అబ్దుల్లాహ్ బిన్ జుబైర్(రజి). సయ్యిదా ఆయిషా(ర.అ) అక్క కుమారుడు, సయ్యిదా అస్మా బిన్తె అబీబకర్(ర.అ) గారి పుత్రుడు. హిజ్రత్ అనంతరం ముస్లింలలో మొదట ఈయనే జన్మించారు. ముస్లింల భార్యలు మదీనాకు వచ్చి వంధ్యు లుగా మారిపోయారని అవిశ్వాసులు ఎద్దేవా చేస్తున్న సమ యంలో ఈయన పుట్టారు. ఆ రోజు ముస్లింల సంతోషాలకు అవధులు లేవు. మహాప్రవక్త(స) స్వయంగా తన శుభవం తమైన చేతితో ఈ పిల్లవాని తలపై ఖర్జూరాన్ని, తన లాలాజలాన్ని రాశారు. సయ్యిదా ఆయిషా(ర.అ) ఒకవిధంగా ఈ అబ్బాయిని తన కొడుకుగా చేసుకున్నారు. ఆ అబ్బాయిపై ఆమె ఎంతో వాత్సల్యాన్ని కురిపించేవారు. ఆయన కూడా తన తల్లి యెడల అమితమైన ప్రేమాదరణలతో వ్యవహరించే వారు *(సహీహ్ బుఖారీ- హ.నెం.3909, 3910; సహీహ్ ముస్లిం- 2146).* ఈయన కాకుండా మరెంతో మంది బాలబాలికల్ని అమ్మ ఆయిషా (ర.అ) తన సంరక్షణలోకి తీసుకుని, వారిని సాకారు (ముఅత్తా ఇమామ్ మాలిక్- 1/251). దైవప్రవక్త(స) జీవించి ఉన్న కాలంలో సయితం ఒక అన్సార్ బాలిక ఆమె సంరక్షణలో పెరిగి పెద్దదై, పెళ్ళి చేసుకుని అత్తవారింటికి వెళ్ళిన సంఘటన హదీసులలో ప్రస్తావనకు వచ్చింది (ముస్నద్ అహ్మద్- 6/269). మస్రూఖ్ బిన్ అజ్దా, ఉమ్రా బిన్తె ఆయిషా బిన్తె తల్హా, ఉమ్రా బిన్తె అబ్దుర్రహ్మాన్ అన్సారియా, అస్మా బిన్తె అబ్దుర్రహ్మాన్ బిన్ అబీబకర్ సిద్దీఖ్, ఉర్వా బిన్ జుబైర్, ఖాసిమ్ బిన్ ముహమ్మద్, అబ్దుర్రహ్మాన్ బిన్ యజీద్ (రజిఅల్లాహు అన్హుమ్) తదితరులు కూడా సయ్యిదా ఆయిషా(ర.అ) పెంపకంలో ఉన్నవారే. ముహమ్మద్ బిన్ అబీబకర్ కుమార్తెలను కూడా ఈమె గారే సాకారు. వారి వివాహాలు కూడా ఆమె గారే చేసేవారు (ముఅత్తా ఇమామ్ మాలిక్).

### వస్త్రధారణ

చాలా తొందరగా ఎదుగుదల కల శరీర స్వభావం ఉన్న బాలికలలో సయ్యిదా ఆయిషా(ర.అ) ఒకరు. తొమ్మిదేండ్ల వయసులోనే ప్రాజ్ఞతకు చేరుకున్నారు (బుఖారీ- హ.నెం. 3894). పిన్న వయసులో ఆమె సన్నగా, నాజూగ్గా ఉండేవారు (బుఖారీ- హ.నెం.4141). కాస్త వయసు పెరగగానే ఆమె శరీరం బొద్దుగా తయారైంది (సునన్ అబూదావూద్- హ.నెం.2578). తెల్లగా, ఎర్రగా ఉండేవారు. అపురూపమైన సౌందర్యవతి (బుఖారీ- హ.నెం.4913).

ఐహిక అనాసక్తత, ఆత్మ తృప్తి కారణంగా అతి నిరాడంబర జీవితం గడిపేవారు. కేవలం ఒక జత దుస్తులనే ఉంచుకుని, వాటినే ఉతికి తొడుక్కునేవారు *(బుఖారీ- హ.నెం.360).* ఆమె వద్ద ఒక పొడవాటి చొక్కా ఉండేది. దాని వెల అయిదు దిర్హంలు. ఆనాటి జీవన ప్రమాణాల రీత్యా అదే ఎంతో ఖరీదైనది. వివాహాది శుభకార్యాల సందర్భంగా, వధువుకు తొడిగించడానికి మదీనాలోని మహిళలు ఆ చొక్కాను అరువుగా అడిగి తీసుకెళుతుండేవారు *(సహీహ్ బుఖారీ- హ.నెం.2628).* ఎప్పుడైనా తన వస్త్రాలను కుంకుమ పువ్వు రంగులో కూడా రంగరించి తొడిగేవారు *(బుఖారీ- హజ్జ్ ప్రకరణం).* అప్పుడప్పుడూ ఆభరణాలు కూడా ధరించేవారు. మెడలో యమన్‌లో తయారైన ఒక నలుపు తెలుపు పూసల హారం ఉండేది *(బుఖారీ- తయమ్ముమ్ ప్రకరణం, హ.నెం. 334).* చేతివ్రేళ్ళకు బంగారు ఉంగరాలు తొడుక్కునేవారు *(బుఖారీ- వస్త్రధారణ ప్రకరణం).* ✤


గీటురాయి వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.


# క్షమాపణ


**- ఎస్.ఎమ్. మలిక్**

నా జాతి, దైవమా!
అమాయకమయింది
అన్ని తెలిసినా, నిజంగానే
ఏమీ ఎరుగనిది
పిచ్చి నమ్మకాల ఊబిలో పడి
కొట్టుమిట్టాడుతోంది
ప్రభూ! నీకు తెలుసు
బలం భయం ఫలం పరువం
అన్నీ అవసరమున్నా
దేని అగత్యమూ లేనిదాని వలే
బ్రతుకుతోంది !
సాధ్యాసాధ్యాలు వదలి
గాలికి రంగులు అద్ది
ఆకాశం తెర పైన నీటితో
బొమ్మలు చిత్రిస్తుంటారు!
మేఘాలలో ప్రేయసి రూపాన్ని
అందాన్నీ దర్శించుకుంటారు!!
ఊహలో సందేశాన్ని
పంపించి బదులు వస్తుందని
ఎదురు చూస్తుంటారు
నా జాతి కవులు అమాయకంగా!!!
గద్దె ముఖం చూసి
వ్యాఖ్యలు చేసినవే చేసి
అవునో కాదో అని
పేపరు ముఖాన పూస్తారు!
ఆగ్రహం వ్యక్తమయ్యే
భయానికి నిలకడతో
నిగ్రహం ప్రదర్శిస్తారు
ఫలితం ఏది తేలినా
తాను నుడివిందే అని
సంబరపడతారు
నిజాయితీగా నాజాతి
రచయితలు అనుదినం!!
అవును స్వామి,
నా జాతి ప్రజలు నిజంగా
నిజాయితీపరులు!
అమాయకులు!!
క్షమార్హులు!!!

కథ

**డా॥ ఖైసర్ అంజుమ్**

**ప్రొఫెసర్, తెలంగాణ యూనివర్సిటీ**



# నిజమైన ప్రేమ

పెళ్లి అయి 2 సంవత్సరాలు కూడా పూర్తి కాలేదు, అంతలోనే గొడవలా? అడిగాడు హబీబ్.

"అవును" అన్నట్టుగా చూశాడు అలీ.

"జోక్ చేస్తున్నావా? తమాషా నా?

"నాకు తెలుసు.. నీతో చెప్పకూడదు అనుకున్నాను. కానీ నాకేమీ అర్థం కావడం లేదు హబీబ్" అన్నాడు బాధతో అలీ.

"అసలు ఏమైందిరా? వదినతో ఏమైనా గొడవ పడ్డావా?" నెమ్మదిగా అడిగాడు హబీబ్.

ఏమి సమాధానం రాలేదు

"భార్యాభర్తల మధ్య చిన్నచిన్న గొడవలు, మనస్పర్థలు చాలా సహజం.... దానికే ఇలా బాధపడితే ఎలా" అంటూ సముదాయించాడు హబీబ్.

"ఊ..." అన్నాడు వినబడనంత నెమ్మదిగా అలీ.

"నీది ప్రేమ వివాహం... పెద్దలను ఒప్పించి, మెప్పించి మరీ వివాహం చేసుకున్నావు కదా!.. మరి ఎందుకిలా మాట్లాడుతున్నావు" అయోమయంగా అడిగాడు హబీబ్.

"హు....ప్రేమ వివాహం...." అంటూ నిట్టూర్చాడు అలీ.

"ఎందుకు అలా దేవదాసు లా మాట్లాడుతున్నావు? నాలుగు నెలల క్రితమే ఆనివర్సరీ అంత గ్రాండ్‌గా జరుపుకున్నావు, మన ఫ్రెండ్స్ అందరూ ఎంత గొప్పగా చెప్పుకున్నారో తెలుసా? నీవెంతో అదృష్టవంతుడివని, అందమైన భార్య, ఇంకా ఎడ్యుకేటెడ్. తరగని ఆస్తి సంపాదించి పెట్టాడు మీ నాన్న, ఇంకా దానికి తోడు నీ బిజినెస్ కూడా చాలా డెవలప్ చేసావు. ఇప్పుడు ఇలా చిన్న విషయానికే నాకు షాక్ ఇస్తున్నావు" అన్నాడు హబీబ్.

"నేనే షాక్‌లో ఉన్నాను... ఇంకా నీకేం షాక్ ఇస్తాను.. నీకు తెలుసా మనం ప్రాణాని కంటే ఎక్కువగా ప్రేమించిన వ్యక్తి, మనల్ని ప్రేమించలేదని తెలిస్తే.... ఎంత పెద్ద షాక్..." బాధను భరించలేక ముఖం తిప్పుకున్నాడు అలీ.

"ఏమిటీ...? వదిన నిన్ను ప్రేమించట్లేదా? నువ్వేనా ఈ మాట అంటున్నది.." ఈ సారి నిజంగానే షాక్ తగిలింది హబీబ్‌కు.

"సమ్రీన్ నన్ను ప్రేమించడం లేదని నేను కలలో కూడా ఊహించలేను" సీరియస్‌గా అన్నాడు అలీ.

"అసలు ఏమైందో చెప్పు, నేను మాట్లాడనా మరి వదినతో లేక నా భార్యను మాట్లాడమని చెప్పనా?" అని సలహా ఇచ్చాడు హబీబ్.

"నా జీవితానికి అదే తక్కువ. నువ్వూ, భాబి వెళ్లి... నా భార్యతో... నన్ను ప్రేమించమని చెబుతారా?" వ్యంగ్యంగా అన్నాడు అలీ.

"అది కాదు రా... విషయం ఏమిటో తెలుసుకుని పరిష్కరిద్దాం" అన్నాడు హబీబ్.

"ఎవరూ వెళ్లి ప్రాధేయపడాల్సిన పని లేదు. నా దురదృష్టం అంతే.." అని దీర్ఘంగా ఏదో ఆలోచించసాగాడు అలీ.

"ప్రాణ స్నేహితులం... నాతో కూడా చెప్పవా... విషయం ఏమిటో?" అలుగుతూ అడిగాడు హబీబ్.

"చెబుతా విను.... కాని నిజం మారదు అని మాత్రం గుర్తుంచుకో

ముందే..” అంటూ బెదిరించాడు అలీ.

“ఓకే... ముందు విషయం ఏమిటో చెప్పు...” అసహనంగా హబీబ్.

“నీకు తెలుసు.. నేను సమ్రీన్‌ను ఎంతగా ప్రేమిస్తానో. కానీ తను నన్ను ఎంతో మాత్రం ప్రేమించడం లేదు.... నేను ఈ నిజాన్ని జీర్ణం చేసుకోలేక పోతున్నాను” అన్నాడు అలీ దుఃఖంతో.

“నువ్వు ఎలా చెప్పగలవు వదిన నిన్ను ప్రేమించటం లేదని... నువ్వు తనని ఎవరితో నైనా చూసావా?” ఇన్వెస్టిగేషన్ చేస్తున్నట్టుగా అడిగాడు హబీబ్.

“ఛ, సమ్రీన్ అలాంటిది కాదు.

విను, చెబుతా.. నేను తన పుట్టిన రోజున ఎంత ఖరీదైన గిఫ్ట్ ఇచ్చానో తెలుసా? నాకిష్టమైన డైమండ్ బ్రేస్‌లెట్. ఇక్కడ డబ్బు విషయం కాదు... తనకు నేను చేసిన ఏ పని నచ్చడం లేదు ఎందుకో మరి” అన్నాడు అలీ బాధతో.

“నీతో చెప్పిందా నచ్చలేదని” అమాంతంగా అడిగాడు హబీబ్.

“మొన్న ఆనివర్సరీకి తెప్పించిన కేక్ ఎక్కడి నుండి తెప్పించానో తెలుసా?” అంటూ ఆగి హబీబ్ వైపు చూశాడు అలీ.

“అవును.. అందరూ చాలా ఇష్టపడి తిన్నారు. మన ఫ్రెండ్స్ మూడు సార్లు తీసుకున్నాడు. నేనే ఆపాను, ఎవరైనా చూస్తే బాగోదని” నవ్వుతూ అన్నాడు హబీబ్.

“ఆ కేక్ కూడా నచ్చలేదు తనకు. ఇంకా వారం క్రితం పెద్ద రెస్టారెంట్‌కు వెళ్ళాము.. అక్కడ కూడా సమ్రీన్‌కు ఏమీ నచ్చలేదు, నాతోపాటు కూర్చోవడమే ఇష్టపడలేదు. ఇంకా మొన్న, అంటే రీసెంట్‌గా ముంబై వెళ్లినపుడు సూపర్ డిజైన్ చేసిన సారీస్ తెచ్చాను... అవీ నచ్చలేదు తనకు” అంటూ ఆగి అక్కడున్న బాటిల్లో నుండి వాటర్ గ్లాసులో పోసాడు.

“ఎందుకు ఇలా చేసింది వదిన.. అడగలేదా నువ్వు?” అంటూ అలీ వైపు చూశాడు హబీబ్.

ఇష్టం లేదని, నచ్చలేదని చెప్పినా ఓకే. కానీ బలవంతంగా ఇలా ఇష్టపడినట్టు నటించడం నేను భరించలేక పోతున్నాను” అంటూ అలీ నిట్టూర్చాడు.

“అంటే.. నువ్వే ఊహించావా తనకు నచ్చలేదని...? నీకెలా తెలిసింది?” అడిగాడు అర్థం కానట్టు.

“తను నా భార్య, ప్రతీ విషయం చెప్పకుండానే అర్థం చేసుకోగలను” అలీ హబీబ్ వైపు చూశాడు..

“వదిన నీ ఇష్టాయిష్టాలను ఏమి పట్టించుకోవడం లేదా” అని అడిగాడు హబీబ్.

“అదేమి లేదు. చాలా బాగా చూసుకుంటుంది నన్ను, నా ప్రతి ఇష్టాన్ని. కాని నాకు తెలుసు తను నన్ను ఇష్టపడటం లేదని” ఖచ్చితంగా చెప్పాడు.

“ఒక్క సారి వదినతో మాట్లాడుతాను? ఒకే ఒక్క సారి, నా మాట విను, నాకోసం కాకపోయినా.. నీ ప్రేమ కోసం...”అన్నాడు హబీబ్.

“పద అప్పుడే నీకు తెలుస్తుంది నిజమేమిటో” అన్నాడు అలీ వెంటనే.

“ఒక్క పది నిమిషాలు టైమివ్వు, నువ్వు వెళ్ళు, నేను నా భార్యతో కలిసి వస్తాను” అన్నాడు హబీబ్ హడావిడిగా.

“ఓకే” అనీ వెళ్ళిపోయాడు అలీ.

పది నిమిషాలలోపే తన భార్యతో కలిసి అలీ ఇంటికి వెళ్ళాడు హబీబ్.

అక్కడ అలీ, సమ్రీన్‌తో పాటు హాల్లో కూర్చుని హబీబ్ రాక కొరకు వేచి చూస్తున్నాడు.

లోనికి వెళ్ళగానే సలాం చేసి హబీబ్ భార్య సమ్రీన్ దగ్గరికెళ్ళి కూర్చుంది.

మెల్ల మెల్లగా ఆ మాట ఈ మాట మాట్లాడుతూ అసలు విషయానికి వచ్చాడు హబీబ్.

“వదిన ఏమైంది మా వాడు ఏదేదో మాట్లాడుతున్నాడు?” అన్నాడు హబీబ్.

“నేనేమి చెప్పగలను అన్నయ్యా, నాకు తెలిసినంతవరకు నేనేమీ తప్పుగా ప్రవర్తించలేదు” అంది నెమ్మదిగా సమ్రీన్.

“నువ్వు అలీని ప్రేమించడం లేదట, అతను తీసుకు వచ్చిన ఏ వస్తువు, ఏ పనిని, ఏ గిఫ్టుని ఇష్టపడటం లేదట, బలవంతంగా ఇష్టపడ్డట్టు నటిస్తున్నావని బాధపడుతున్నాడు పాపం అలీ” అని అన్నాడు హబీబ్.

హబీబ్ భార్య సమ్రీన్ చేతులను తన చేతిలోకి తీసుకొని విషయం ఏమిటో చెప్పు అన్నట్టుగా చూసింది.

“ఒకే ఒక్క విషయం అడుగుతాను అన్నయ్యా! నాకు మీరు సమాధానం ఇస్తే చాలు” అంది సమ్రీన్.

“ఏమిటో అడుగు, నువ్వు నా చెల్లితో సమానం”అంటూ అభిమానంగా అడిగాడు హబీబ్.

“ప్రేమ, ప్రేమించడం అంటే ఏమిటి? మనం ప్రేమించే వారి ఇష్టానుసారం నడుచుకోవడమా లేక మన ఇష్టం ప్రకారం ఇతరులు నడవాలని ఆశించడమా?” అంటూ సూటిగా అడిగింది.

“నేను ఎవరినైతే ప్రేమిస్తానో వారి ఇష్టాన్ని నా ఇష్టంగా భావిస్తాను,

వారు దేనినైతే అసహ్యించుకుంటారో నేను కూడా అసహ్యిం చుకుంటాను. ఇది నా ఉద్దేశ్యంలో ప్రేమ'' అన్నాడు హబీబ్.

"మరి మీ ఉద్దేశ్యంలో అలీ, ప్రేమంటే?" అని అడిగింది అలీ వైపు సూటిగా చూస్తూ.

"నా ఉద్దేశ్యంలోనూ అంతే మనం ఎవరినైతే ప్రేమిస్తామో వారి ఇష్టాయిష్టాలను మనం కూడా అదేవిధంగా ప్రేమిస్తాము, అదే విధంగా అయిష్టపడతాము'' అన్నాడు అలీ.

"మరి నేను మీ ప్రతి ఇష్టాన్ని గౌరవించాను ఇంకా, మీ ఇష్టానుసారమే నడుచుకుంటున్నాను. కానీ మీరు మాత్రం నా ఇష్టాన్ని గుర్తించారా? నేను ఎందుకు బాధపడుతున్నానో తెలుసుకునే ప్రయత్నం చేసారా ఎప్పుడైనా?'' అంది బాధతో.

"అంటే, నేను నిన్ను ప్రేమించడం లేదా?"అని కోపంతో అడిగాడు అలీ.

"లేదు ముమ్మాటికీ మీరు నన్ను ప్రేమించటం లేదు, మిమ్మల్ని మీరే ప్రేమించుకుంటున్నారు, నా ఇష్టాన్ని ఎప్పుడూ ఖాతరు చేయలేదు'' అంది బాధతో సమీన్.

"అది ఎలా? నీకు చాలా విలువైన గిఫ్ట్ ఇచ్చాడు, పార్టీస్, సెల బ్రేషన్స్ ఇంకా....'' ఏదో చెప్పబోయింది హబీబ్ భార్య.

"అవన్నీ అలీకి ఇష్టమైన పనులు. నాకు కాదు. నాకు రెస్టారెంట్లో తినడం ఇష్టం ఉండదు, ఎక్కడైనా గార్డెన్లో కూర్చుండి తింటే బాగుంటుంది అనిపిస్తుంది''.

నాకు డైమండ్ బ్రేస్లెట్ అస్సలు ఇష్టం లేదు దానికి బదులు నా బర్త్ డే రోజు పేదవారికి అన్నదానం చేయాలి అనిపిస్తుంది. నా ఆనివర్సరీ సెలబ్రేట్ చేయడం నచ్చదు, ఇంకా ఆ రోజు తెచ్చిన కేక్ నేను తినకూడదు, ఎందుకంటే నాకు ఎలర్జీ. కానీ నేను తిన్నాను..

నాకు సారీస్ అంటే అస్సలు ఇష్టం లేదు, నేను పంజాబీ డ్రెస్సులు ఇష్టపడతాను. కానీ నేను దేనికి నిరాకరించలేదు, ఎందుకంటే నేను అలీనీ ప్రేమిస్తున్నాను... కానీ నిజానికి అలీ నన్ను ప్రేమించడం లేదనిపిస్తుంది'' అంటూ తన దుఃఖాన్ని ఆపుకునే ప్రయత్నం చేసింది సమీన్.

హబీబ్, హబీబ్ భార్య ఇద్దరు అలీ వైపు చూశారు. అలీ తన ఆలోచనల్లో మునిగిపోయాడు.

"నా పైన కోపం ఎందుకు పెరిగిందంటే...మొన్న, మిలాద్ ఉన్ నబీ రోజు మన చివరి ప్రవక్త అయిన ముహమ్మద్ సల్లల్లాహు అలైహివసల్లం పుట్టిన రోజు చాలా గ్రాండ్‌గా జరుపుకుందామ''ని అన్నారు అలీ.

నేను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పుట్టినరోజు వారు తన జీవిత కాలంలో కానీ వారి తర్వాత సహాబా, ఎవరూ జరుపుకో లేదు ఇలా చేయడం తప్పు అన్నాను.

కానీ వినిపించుకోలేదు, నేను ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను చాలా ప్రేమిస్తున్నాను కాబట్టి పుట్టిన రోజులు తప్పకుండా చాలా చాలా గ్రాండ్‌గా జరుపుకుంటాను అని మొండిగా మాట్లాడారు అలీ.

నేను "మనం ఎవరినైతే ప్రేమిస్తున్నామో వారి ఇష్టానుసారం నడుచుకోవడమే నిజమైన ప్రేమ. కానీ వారి ఇష్టానికి వ్యతిరేకంగా మన సంతోషం కొరకు మన ఆనందం కొరకు వారి ఆచరణలకు వ్యతిరేకంగా, వారి ఆదేశాలకు విరుద్ధంగా ఏ పని చేసినా అది ప్రేమ అనిపించుకోదు అని చెప్పాను.

"నువ్వు అంటుంది ముమ్మాటికి నిజమే సమీన్ అంది హబీబ్ భార్య.

హబీబ్ కూడా అవునన్నట్లుగా తల ఊపాడు.

"మనం ఎవరినైతే అమితంగా ప్రేమిస్తామో వారి ఇష్టానికి వ్యతి రేకంగా ఏ పని చేయడానికి ఇష్టపడము. వారి ఇష్టాన్ని మన ఇష్టంగా చాలా సంతోషంగా స్వీకరిస్తాము ఇదీ నిజమైన ప్రేమంటే... కానీ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను మనము అందరికంటే ఎక్కువగా ప్రేమిస్తాము.

సృష్టికర్త అల్లాహ్ తర్వాత అత్యంత ఇష్టపడే ఆదర్శమూర్తి మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం.

కానీ మనము వారి ఆదేశాలను ఆచరించడం పక్కనబెట్టి, కొత్త కొత్త విషయాలను మనకు నచ్చే విషయాలను, మనం మెచ్చే విషయాలను సున్నత్ అంటూ.. బిద్అత్‌ను పాటిస్తున్నాము'' అంది సమీన్.

అలీ చాలా సీరియస్‌గా ఆ మాటలు విన్నాడు తను చేసిన ప్రతి పనిని గుర్తుచేసుకుని నిజాన్ని గ్రహించాడు. ఎల్లవేళలా తన ఇష్టం ప్రకారమే పని చేసాడు, కానీ తను ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించే తన భార్య ఇష్టాయిష్టాలను తెలుసుకోవడానికి ప్రయత్నం చేయలేదు అని బాధపడ్డాడు.

"సమీన్, నిజంగా ఇంత వరకు నన్ను నేనే ప్రేమించాను కానీ నీ ప్రేమను ఇష్టాఇష్టాలను గమనించలేకపోయాను, గుర్తించలేక పోయాను... నన్ను క్షమించు. ఇకముందు నేను ఎవరినైతే ప్రేమి స్తానో వారి ఇష్టానుసారం ప్రకారం నా జీవితాన్ని గడుపుతాను.

మన అందరి ప్రవక్త అయిన ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం వారి ఆదేశాలను, సున్నత్‌లను, హదీసులను పాటించేం దుకు తప్పక ప్రయత్నం చేస్తాను. ఎందుకంటే నాది నిజమైన ప్రేమ'' అంటూ అందరి ముందు క్షమాపణ వేడుకొన్నాడు అలీ. ✤

○ నుస్రత్ ఫాతిమా ○



# ఫ్యామిలీ లైఫ్

ఇల్లంటే...

సిమెంటు నిర్మాణం కాదు

విలాసవంతమైన సామగ్రి అంత కన్నా కాదు

ప్రేమ, ఆప్యాయతలనే ఇటుకలతో నిర్మించేదే ఇల్లు

భార్యాభర్తల అన్యోన్యత, తోబుట్టువుల మధ్య ప్రేమ, అనురాగంతో ఆ ఇంట్లో సంతోషాలు విరబూస్తాయి

ఇల్లంటే అద్దాల మేడ కావాల్సిన పని లేదు. అది పూరి గుడిసె అయినా కావచ్చు.

ఇల్లే సమాజానికి నిలయం. మనిషి మొట్టమొదటి విద్యాలయం ఇంటి గుమ్మమే. ఇంట్లో తల్లిదండ్రులే పిల్లలకు మొట్ట మొదటి గురువులు. ఇంట్లో ఆది గురువులకు గౌరవాదరణలు లభించాలి. ఆలూమగల మధ్య అన్యోన్యత ఉట్టిపడాలి. భార్యభర్తలు పరస్పరం నమ్మకానికి మారుపేరుగా నిలవాలి. భార్య తన భర్తను గౌరవభావంతో చూడాలి. పిల్లల్లో తండ్రి పట్ల గౌరవభావాన్ని ఇనుమడింపజేసేలా వ్యవహరించాలి. భర్త తను కట్టుకున్న భార్యతో వ్యవహరిస్తున్న తీరు పిల్లలపై ప్రభావం చూపుతుంది. ఆదర్శ దంపతుల శిక్షణతో పిల్లల్లో ఆదర్శ భావాలు పెంపొందుతాయి.

ప్రవక్త కుటుంబ జీవితం అందరికీ ఆదర్శ ప్రాయం. ప్రవక్తా పదవి లాంటి బృహత్తర బాధ్యత భుజస్కంధాలపై ఉన్నప్పటికీ ప్రవక్త (స) ఇంట్లో ఎంతో కలుపుగోలుగా మెలిగేవారు. ఇంటి వారికి సలామ్ చేసి ప్రవక్త (స) ఇంట్లోకి అడుగుపెట్టేవారు. ఎంతో సౌమ్యంగా మెలిగేవారు. చాలామంది ఫ్రెండ్స్‌తో ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఎంతో సంతోషంగా, మరెంతో సన్నిహితంగా గడుపుతారు. ఇంట్లోకి రాగానే ముఖ కవళికలన్నీ మారిపోతాయి. ఇంటి గడప తొక్కగానే చిర్రుబుర్రులాడే వారూ లేకపోలేదు. భార్య దృష్టిలో ఉత్తమంగా మెలిగే భర్తే వాస్తవానికి సమాజం

దృష్టిలో ఉత్తమమైనవాడు. ఒకడు మంచివాడో చెడ్డ వాడో భార్యకు తెలిసినంతగా మరి ఏ ఒక్కరికీ తెలియదు. సంసారిక జీవితంలో ఎన్నో కష్టసుఖాలుంటాయి. మరెన్నో ఆటు పోటు లుంటాయి. భార్యాభర్తల కీచులాటలు, పిల్లల పెంపకం, ఆర్థిక ఇబ్బందులు ఇలా ఎన్నో ఉంటాయి. వాటన్నింటినీ మేనేజ్ చేసుకుంటూ సంసార నౌకను సవ్యంగా నడప గలిగే దంపతులు నిజానికి సౌభాగ్యవంతులు.

'ప్రవక్త (స) ఇంట్లో ఎప్పుడూ ఉల్లాసంగా ఉండేవారు. పవిత్ర పెదాలపై ఎప్పుడూ చిరునవ్వు తొణికిసలాడేది' అని ప్రవక్త (స) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) చెప్పారు. 'ప్రవక్త(స) ఇంట్లో తమ పనులు తామే చేసుకునేవారు. మేజోళ్లను కుట్టుకునేవారు. చిరిగిన దుస్తులకు మాసికలు వేసుకునేవారు. మేకల పాలు పిండేవారు. తమ పనులను భార్యా పిల్లలపై మోపేవారుకాదు. ఏ పనినీ ఆదేశించినట్లుగా చెప్పేవారు కాదు' అని ఆయిషా (రజి) ప్రవక్త (స) గురించి ఒక హదీసులో పేర్కొన్నారు.

భార్యాభర్తల బంధాన్ని ఖుర్ఆన్ దుస్తులతో పోల్చింది. భార్య భర్తకు, భర్త భార్యకు దుస్తులని ఖుర్ఆన్ పేర్కొంది. మనం తొడిగే దుస్తులు మన దేహానికి ఎప్పుడూ అతుక్కుని ఉంటాయి. మనకు అందాన్ని, ఆకర్షణను కలిగిస్తాయి. రక్షణగా ఉంటాయి. మన గౌరవ మర్యాదలను ఇనుమడిస్తాయి. అదే విధంగా దుస్తుల వలే భార్య భర్తకు, భర్త భార్యకు ఆకర్షణగా మారాలి. రక్షణగా నిలవాలి. పరస్పరం గౌరవ మర్యాదలకు చిహ్నంగా నిలవాలి. ఆలూ మగల బంధం దాపరికాలు లేనిది. దాంపత్య జీవితంలో వచ్చే కష్టనష్టాలు, దుఃఖాలు, ఆపదలతో బంధం సన్నగిల్లే ప్రమాద ముంది. పొరపొచ్చాలు, అపోహలు, అపార్థాలు దాంపత్య బంధాన్ని విచ్ఛిన్నం చేస్తాయి. భార్యాభర్తల బంధం సన్నగిల్లితే ఆ ఇంట్లో సుఖ, సంతోషాలు అందని ద్రాక్షగానే మిగులుతాయి.

భార్యాభర్తలు పరస్పరం చేదోడువాదోడుగా నిలిస్తే, జీవిత ప్రయాణంలోని ప్రతీ అడుగులో తోడుంటే ఆ ఇంట్లో పిల్లల పెంపకం సవ్యంగా సాగుతుంది. పిల్లలు సుశిక్షితులవుతారు. ఆ ఇల్లు స్వర్గానికి చిరునామాగా మారుతుంది. ఇంట్లో అమ్మా నాన్నలు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఉంటే మాత్రం పిల్లల పెంపకం గాడి తప్పుతుంది. పిల్లలు మంచి మార్గంలో నడవరు. అమ్మ ఒకటి చెబితే నాన్న ఒకటి చెబుతాడు. పిల్లలు ఎవరిని వినాలో అర్థం కాక ఎవరి దారి వాళ్లు చూసుకుంటారు.

ఫ్యామిలీ లైఫ్ హ్యాపీగా గడపాలంటే ఇంట్లో ధార్మిక వాతావరణం కలిగించాలి. భార్యాభర్తలిరువురూ దైవ విధేయులవ్వాలి. ఐదు పూటలా నమాజు చేసి, రమజాన్ ఉపవాసాలు పాటించి, భర్తకు విధేయత చూపి, తన సౌశీల్యాన్ని కాపాడుకుని, పిల్లలకు సరైన విద్యాబుద్ధులు నేర్పే మహిళకు స్వర్గశుభవార్త నిచ్చారు ప్రవక్త (స). అలాంటి మహిళ స్వర్గద్వారాలలోని ఎనిమిది ద్వారాలలో ఏ ద్వారం నుంచైనా స్వర్గ ప్రవేశం చేయవచ్చు. భర్త పట్ల కృతజ్ఞతా భావంతో మెలగని మహిళ వంక దేవుడు కన్నెత్తి కూడా చూడడు.

భర్త తన ఇంటివారి అవసరాలు తీర్చేందుకు పిసినారిగా వ్యవహ రించకూడదు. అలాగని మితిమీరి దుబారా కూడా చేయకూడదు. తన ఇంటివారి పట్ల శ్రేయో గుణం కలవాడే అల్లాహ్‌కు అత్యంత ప్రియమైనవాడు. దైవం ప్రసాదించిన ఉపాధి పట్ల కృతజ్ఞతలు తెలుపుకోవాలి. భార్య హక్కులు నెరవేర్చాలి. కష్టపడి సంపాదిం చిన కష్టార్జితాన్ని ఇంటివారిపై వెచ్చించడం కూడా సదాచరణే నన్నారు ప్రవక్త మహనీయులు. భార్య నోటికి ముద్ద అందించడం కూడా సదాచరణే అని చెప్పి భార్యాభర్తలు అన్యోన్యంగా గడపా లన్నారు. ఆదర్శ దంపతులతోనే అందమైన ఫ్యామిలీ ఏర్పడు తుంది. అందమైన ఫ్యామిలీతోనే మెరుగైన సమాజం వృద్ధిలోకి వస్తుంది.

## ఖదీజా(ర)కు అల్లాహ్ సలాములు

'ఓ ముహమ్మద్! నీ పవిత్ర సతీమణి ఖదీజా కాసేపట్లో నీదగ్గరికి రానుంది. ఆమె చేతిలో ఆహార పదార్థాల పళ్లెం ఉంది. అన్నం, కూర, నీళ్లు ఆ పళ్లెంలో ఉన్నాయి. ఆమె రాగానే 'ఖదీజా! నీ ప్రభువు నీకు సలామ్ చెబుతున్నాడు. నా తరపు నుంచి కూడా ఖదీజా (రజి)కు సలాములు తెలుపు. స్వర్గంలో ఆమె కోసం ఒక గొప్ప ఇల్లు నిర్మించినట్లు చెప్పు.' అని శుభవార్త నిచ్చారు జిబ్రాయీల్ అమీన్.

మహాప్రవక్త ముహమ్మద్-హజ్రత్ ఖదీజా (రజి)లు ఆదర్శ దంపతులు. ప్రవక్త (స) హిరా గుహలో ధ్యానం చేసుకుంటూ రోజులు గడిపేవారు. ఖదీజా స్వయంగా వంట వండి ప్రవక్త కోసం తీసుకుని వచ్చేవారు. ఆ కాలంలో హిరా గుహ మార్గమంతా అంధకారంగా ఉండేది. ఎంతో ఎత్తులో ఉన్న ఆ గుహకు చేరుకోవడమంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవడమే. తన భర్త ఆకలి తీర్చేందుకు ఖదీజా పడుతున్న తాపత్రయం, ఆత్రుత, కృషి అల్లాహ్‌కు ఎంతగానో నచ్చింది. ఆమె హిరా గుహకు చేరక ముందే జిబ్రీల్ దైవదూత హిరా గుహలో ధ్యానంలో ఉన్న ముహమ్మద్ ప్రవక్త (స) ఖదీజా భోజనం తీసుకుని వస్తుందన్న శుభవార్తను అందించారు. భర్తకు సేవచేయడంలో ఎలాంటి లోటురానీయకుండా చూసుకునే భార్యకు స్వర్గంలో ఇల్లు నిర్మాణమవుతుంది. స్వహస్తాలతో వంట వండి భర్తకు తినిపిం చడం కూడా సదాచరణేనని ఖదీజా (రజి) ఘటన ద్వారా రుజువవుతుంది. ✤

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

**తఫ్హీముల్ ఖుర్ఆన్ (ఖుర్ఆన్ అవగాహనం): మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది, తెలుగురూపం: ఎస్.ఎమ్. మలిక్**

**88 ఆయత్‌లు** **మక్కా అవతరణ**

# 38. సాద్

25 – 26... అప్పుడు మేము అతని ఆ తప్పిదాన్ని మన్నించివేశాము, నిశ్చయంగా మా వద్ద అతనికి అతి సన్నిహిత స్థానముంది, ఇంకా ఉత్తమ అంతిమ పరిణామముంది. (మేము అతనికి చెప్పాము) దావూద్, మేము నిన్ను భువిలో ఖలీఫా చేశాము, కనుక నీవు జనుల మధ్య ధర్మంగా పరిపాలన చెయ్యి. మనోకాంక్షను అనుసరించకు, అది నిన్ను దైవమార్గం నుంచి దారి తప్పిస్తుంది. ఎవరయితే దైవమార్గం నుండి తప్పిపోతారో నిశ్చయంగా వారి కొరకు కఠినమయిన శిక్ష పొంచి ఉంది, కారణం వారు లెక్కచూపే దినాన్ని అసలే మరచిపోయారు."[28]

**(28వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

ఈ వ్యాఖ్యానం ఈ గాథను వివరించిన పూర్వాపరాల మధ్య కూడా సరిగ్గా అతుకుతుంది. వచన క్రమాన్ని గమనిస్తే స్పష్టంగా తేలేదేమిటంటే దివ్య ఖుర్ఆన్‌లో ఈ గాథ రెండు ఉద్దేశాలతో పేర్కొనబడింది. మొదటి ఉద్దేశం, ప్రవక్త మహనీయులకు సహనాన్ని బోధించడం. ఈ ఉద్దేశంతో ఆయన్ని సంబోధించి, "వీరు పలికే మాటలకు సహనం వహించు, మా దాసుడు దావూద్ గాథను వివరించు" అనడం జరిగింది. అంటే నిన్నయితే మాంత్రికుడని, అబద్ధాలకోరని మాత్రమే అంటున్నారు. కాని మా దాసుడు దావూద్‌పైనయితే దుర్మార్గులు వ్యభిచారం, కుట్రతో కూడుకున్న హత్య వంటి నేరారోపణలు మోపారు. అందువల్ల వీరు ఏమి చెప్పినా భరిస్తూ ఉండాలి. రెండవ ఉద్దేశం, తిరస్కారులకు, మీరు విచారణ జరిగే భయం లేకుండా ప్రపంచంలో రకరకాలుగా అత్యాచారాలు చేస్తూ పోతున్నారు, కాని ఏ దేవుని దైవత్వంలో నయితే మీరు ఈ చేష్టలు చేస్తున్నారో ఆయన ఎటువంటి విచారణ లేకుండా వదలిపెట్టడు. కడకు ప్రియతమ, సన్నిహితులయిన దాసులు సయితం ఏదయినా స్వల్పమయిన తప్పుచేసినా విశ్వ ప్రభువు వారిని కఠినంగా ప్రశ్నిస్తాడు, విచారణ జరుపుతాడు. ఈ ఉద్దేశంతోనే ప్రవక్త మహనీయులు (స)కు చెప్పడం జరిగింది, వీరి సమక్షంలో మా దాసుడు దావూద్ గాథను వివరించు ఆయన ఎన్నెన్నో సుగుణాల రాశి. కాని ఆయన వల్ల ఒక అనుచితమయిన విషయం సంభవించగానే మేము ఏ విధంగా ఆయన్ని పట్టుకుని మందలించామో గమనించండి అని చెప్పు.

ఈ సందర్భంలో ఒక అపార్థం ఇంకా మిగిలి ఉంటుంది. దాన్ని దూరం చేయడం అవసరం. ఉపమానంలో వ్యాజ్యం ముందుంచిన వ్యక్తి, అతని వద్ద 99 గొర్రెలుండగా తన వద్ద ఒకటి మాత్రమే ఉందని, దాన్నీ ఇతడు ఇవ్వమని అడుగుతున్నాడని అంటాడు. దీనివల్ల స్థూలంగా ఒక అనుమానం కలగడం కద్దు - బహుశా మహనీయ దావూద్ (అ) వద్ద 99 మంది భార్యలున్నా ఆయన మరొక స్త్రీని పొంది 100 సంఖ్యను పూర్తి చేయాలని కోరుకున్నారేమో అనిపిస్తుంది. కాని ఉపమానంలోని ప్రతి స్వల్పమయిన అంశమూ మహనీయ దావూద్, ఊరియాల వ్యవహారానికి అక్షరక్షరం అతకడం అవసరం లేదు. సాధారణ దినసరి ప్రయోగంలో 10, 20, 50 తదితర సంఖ్యలు కేవలం అధిక సంఖ్యను సూచించడానికి ప్రయోగించడం జరుగుతుంది, ఖచ్చితమయిన సంఖ్యను కాదు. మనం ఎప్పుడయినా నేను నీకు ఫలానా విషయం పదిసార్లు చెప్పి ఉంటాను అని అంటే దాని భావం సరిగ్గా పదిసార్లు ఎంచి మరీ ఆ మాట చెప్పామని కాదు. అనేకసార్లు ఆ మాట చెప్పడం జరిగిందన్నదే అసలు భావం. ఇక్కడా అదే సంగతి. ఉపమాన వ్యాజ్యంలో ఆ వ్యక్తి హజ్రత్ దావూద్‌కు, మీ వద్ద ఇప్పటికే అనేకమంది భార్యలున్నారు. అయినా మీరు మరో వ్యక్తి భార్యను పొందాలని కోరుతున్నారు. ఈ విషయాన్నే వ్యాఖ్యాత నీసాబూరి హజ్రత్ హసన్ బస్రీ ద్వారా ఉటంకించారు. "హజ్రత్ దావూద్‌కు 99 మంది భార్యలుండేవారు కారు, ఇది కేవలం ఒక ఉపమానం మాత్రమే." (ఈ గాథను మేము మా ఉర్దూ పుస్తకం 'తఫ్హీమాత్', రెండవ భాగంలో నికరంగా చర్చించాము. మేము పైన వివరించిన అన్వయింపునకు సవివరమయిన ఆధారాలను ఎవరయినా తెలుసుకోదలిస్తే వారు ఈ పుస్తకంలోని పుటలు 29 - 44 చూడాలి).

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (3వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)

తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

## వాణిజ్య ప్రకరణం

(క్రయ విక్రయాలు)

### అధ్యాయం : 61

### 'ములామసా'[1] వర్తకం గురించి

దైవప్రవక్త(సఅసం) ఈ వర్తకం నుండి వారించారని హ్జ్రత్ అనస్(రజి) చెప్పారు.

**354)** హ్జ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు (సఅసం), 'మునాబజా' వర్తకం నుండి వారించారు. ఇది ఎలా ఉంటుందంటే, ఒక వ్యక్తి అమ్మకం నిమిత్తం తన వస్త్రాన్ని (కొనుగోలుదారు అయిన) అవతలి వ్యక్తి వైపు విసురుతాడు. ఆ వ్యక్తి ఆ వస్త్రాన్ని తిరగవేసి లేదా దానిని పరిశీలనగా చూడకముందే (కేవలం విసిరివేసిన కారణంగా) ఆ బేరం తప్పనిసరి అయిపోయేది. అదేవిధంగా దైవప్రవక్త(స) 'ములామసా' వర్తకం చేయడాన్ని కూడా వారించారు. ఇది ఎలాగుండేదంటే (కొనుగోలుదారుడు) వస్త్రాన్ని పరిశీలించకుండానే, కేవలం ముట్టుకునేవాడు. దాంతో బేరం కుదిరినట్టుగా పరిగణించేవారు. దీనిని కూడా మోసపూరితమైన వర్తకంగా ఖరారు చేయటం జరిగింది.

**355)** మహనీయ అబూ హురైరా (రజి) చెప్పారు : రెండు రకాల వస్త్రధారణ నుండి వారించటం జరిగింది. అంటే ఎవరయినా ఒక వ్యక్తి ఒకే వస్త్రాన్ని గోటు కట్టుకుని కూర్చుని, మరి అదే వస్త్రాన్ని (మర్మస్థానం బహిర్గతమయ్యేలా) తన భుజం మీద వేసుకోవటం. రెండు రకాల వర్తకం నుండి కూడా వారించటం జరిగింది. ఒకటి : ములామసా వర్తకం. రెండు: మునాబజా వర్తకం.[1]

### అధ్యాయం : 62

### 'మునాబజా' వ్యాపారం గురించి- దైవప్రవక్త(సఅసం) దీని నుండి వారించారని హజ్రత్ అనస్(రజి) చెప్పారు

**356)** హ్జ్రత్ అబూ హురైరా (రజి) కథనం : దైవప్రవక్త(సఅసం) ములామసా, మునాబజా వ్యాపారం చేయడం నుంచి వారించారు.

**357)** మహనీయ అబూ సయీద్ ఖుద్రీ (రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు (సఅసం) రెండు రకాల వస్త్రధారణ నుండి వారించారు. అలాగే రెండు రకాల వ్యాపారం నుండి, అంటే ములామసా, మునాబజా నుండి వారించారు.

61-1. దీని వివరణ మున్ముందు హదీసులో రానున్నది.

355-1. ఈ ఉల్లేఖనంలో రెండవ రకపు వస్త్రధారణ గురించి ప్రస్తావించబడలేదు. అది 'ఇష్తిమాలె సమ్మా' అంటే ఒకే వస్త్రాన్ని శరీరమంతటినీ కలిపి చుట్టుకోవటం, ఆఖరికి చేతులు తదితర అవయవాలేవీ బయట పడకుండా చుట్టివేయడం.

ఇక 'నసాయి'లోని ఉల్లేఖనంలో ములామసా వర్తకం గురించి ఇవ్వబడిన వ్యాఖ్యానం ఇలావుంది: ఒక వ్యక్తి మరో వ్యక్తితో, 'నా వస్త్రాన్ని నీ వస్త్రానికి బదులుగా అమ్ముతాను. అయితే ఇతరుల వస్త్రాన్ని చూడకూడదు. కేవలం ముట్టుకోవచ్చు'' అనంటాడు. ఇక మునాబజా వర్తకం విషయానికి వస్తే, కొనుగోలుదారునికి- అమ్మకం దారునికి మధ్య ఒప్పందం కుదురుతుంది. దాని ప్రకారం, ''నా దగ్గర ఉన్నది నీ వైపునకు విసురుతాను. నీ వద్ద ఉన్నది నా వైపునకు విసిరివెయ్యి''- అంతే, ఈ ఒక్క నిబంధనపై వర్తకం జరిగిపోతుంది. అవతలి వ్యక్తి దగ్గర ఏమున్నది, ఎంత ఉన్నది అనేది ఎవరికీ తెలియదు.

❖ ❖ ❖




మనిషి తన జీవితాన్ని ఏ విధంగా గడపాలో దివ్య ఖుర్‌ఆన్ సవివరంగా వివరిస్తుంది. ఏ ఏ పనులు చెయ్యాలో, ఏ ఏ కార్యాలు చెయ్యకూడదో, ఏవి ధర్మ సమ్మతమో, ఏవి నిషిద్ధమో అన్నీ తెలుపబడ్డాయి. స్వర్గ నరకాల గురించి ప్రస్తావించ బడింది. సత్కార్యాలను మెచ్చి, అల్లాహ్ సంతుష్టుడై దాసునికి ఇచ్చే అత్యుత్తమ కానుకయే స్వర్గం. దాసుని దుష్కార్యాల, అవిధేయతకు పర్యవసానంగా ఇవ్వబడే అతి చెడ్డ నివాసమే నరకం. ఖుర్‌ఆన్‌లో స్వర్గవాసుల, నరకవాసుల లక్షణాలను సుస్పష్టంగా ముందుంచటం జరిగింది. ఇలా రెండింటినీ మానవుల ముందుంచటం వల్ల ఇవి వారి నైతిక, సామాజిక, ఆర్థిక, కుటుంబ జీవనంపై ఎంతో ప్రభావాన్ని చూపుతాయి. ప్రజలు మంచి కార్యాలకు దగ్గరై, చెడు కార్యాలకు దూరంగా ఉండేందుకు ప్రయత్నిస్తారు.

**-తస్నీమ్ జహాన్ ఖాన్**

దివ్య ఖుర్‌ఆన్‌లో ఫ్యామిలీ లైఫ్‌నకు సంబంధించిన అనేక ముఖ్య ఆదేశాలు ఇవ్వబడ్డాయి. వాటిని అమలు పరచి అల్లాహ్‌ను సంతుష్టపరిచే మార్గాలు సుగమం చేసుకోవచ్చు.

1) కుటుంబ జీవితం వివాహంతో మొదలవుతుంది. స్త్రీ పురుషుల మధ్య ఫిజికల్ రిలేషన్‌కు ఖుర్‌ఆన్ ఒకే ఒక్క మార్గాన్ని ఇస్తుంది. అదే వివాహ బంధం! భార్యాభర్తల సంబంధాన్ని ఖుర్‌ఆన్ అల్లాహ్ సూచనగా పేర్కొంది. "ఆయన సూచనలలో మరొకటి ఏమిటంటే, ఆయన మీ కొరకు భార్యలను మీ జాతిలో నుండే సృష్టించాడు." (అర్‌రూమ్ : 21)

వివాహేతర సంబంధాలు స్త్రీ పురుషులిద్దరి పరస్పర అంగీకారంతో ఏర్పరచినా, బలవంతంగా ఏర్పరచినా, దాన్ని వ్యభిచారంగానే పరిగణించబడుతుంది. దాన్ని అతి పెద్ద పాపకార్యంగా ఖుర్‌ఆన్ పేర్కొంటుంది. విశ్వాసులు ఈ దుష్కార్యం నుండి తమనుతాము కాపాడుకుంటారని విశ్వాసుల లక్షణాల్లో తెలుపుతుంది. "కరుణామయుని అసలు దాసులు ఎవరంటే... వ్యభిచారానికి పాల్పడని వారు" (25: 68)

వ్యభిచారానికి ఇహలోకంలోనూ కఠినమైన శిక్షలు పెట్టి ఉన్నాయి. అల్లాహ్ ఇలా ఆదేశిస్తున్నాడు: 'వ్యభిచారిణి, వ్యభిచారి- ఈ ఇద్దరిలో ప్రతి ఒక్కరినీ నూరేసి కొరడా దెబ్బలు కొట్టండి."
(దివ్య ఖుర్‌ఆన్- 24: 2)

2) నికాహ్ గురించి ఇంకో క్లారిటీ కూడా ఇచ్చింది. విశ్వాసి స్త్రీ అయినా, పురుషుడైనా విశ్వాసితోనే వివాహమాడాలి. ఎందుకంటే ఇద్దరిలో ఎవరో ఒకరు అవిశ్వాసులైన తరుణంలో వారి కారణంగా విశ్వాసి అయిన భాగస్వామి లేదా వారి పిల్లలు అవిశ్వాసంలో కూరుకుపోయి నరకానికి పోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ విధంగా నికాహ్‌ను స్వర్గనరకాల పర్యవసాన గీటురాయితో పరికించమని అల్ బకర సూరాలోని 221 ఆయత్‌లో స్పష్టంగా తెలుపబడింది.

3) నికాహ్‌కు షరతుగా భర్త మహర్‌ను చెల్లించాలని నిర్ణయించింది. మహర్‌కు ఎలాంటి హద్దును ఇంత అంత అని షరీఅత్ నిర్ణయించలేదు. భార్యాభర్తల ఇష్టానుసారం మహర్‌ను నిర్ణయించుకుంటారు. భర్త ఆ మొత్తాన్ని సంతోషంతో చెల్లించాల్సి ఉంటుంది. భార్య స్వయంగా మహర్‌ను మాఫీ చేసినా, లేదా కొంత మొత్తాన్ని మాఫీ చేసినా చేసుకోవచ్చు. "స్త్రీలకు వారి మహర్‌ను సంతోషంగా (విధిగా భావిస్తూ) చెల్లించండి. అయితే

వారు తమంత తాము మహర్‌లో కొంత భాగాన్ని తమ ఇష్ట పూర్వకంగా విడిచిపెడితే దానిని మీరు సంతోషంగా అనుభవించండి" (4: 4) ఒకవేళ నికాహ్ తర్వాత మనస్పర్థల వల్ల విడాకులు తీసుకోవలసి వస్తే : "మీరు ఆమెకు ఒక పెద్ద ధనరాశిని ఇచ్చి ఉన్నాసరే దాని నుండి ఏ కొంచెం కూడా తిరిగి తీసుకోవద్దు."

(దివ్య ఖుర్‌ఆన్- 4: 20)

తిరిగి తీసుకోవడాన్ని "ఘోరమైన అన్యాయం"గా ఖుర్‌ఆన్ పరిగణిస్తుంది.

4) ఖుర్‌ఆన్‌లో భార్యాభర్తల హక్కులు, బాధ్యతలను గురించి వివరించబడి ఉంది. భర్త కుటుంబ సంరక్షకుడు, వ్యవస్థాపకుడుగా ఉండాలి. భార్య విధేయురాలై, సౌశీల్యవతిగా ఉండాలి. "పురుషులు లేని సమయంలో అల్లాహ్ రక్షణలో ఉంటూ వారి హక్కులను కాపాడుతారు. భర్త చీటికి మాటికీ అకారణంగా భార్యను వేధించడాన్ని గురించి గట్టిగా వారిస్తుంది ఖుర్‌ఆన్.

5) భర్త కుటుంబానికి యజమాని కాబట్టి వారి నైతిక, ధార్మిక శిక్షణల బాధ్యత కూడా అతనిపైనే ఉంటుంది. "విశ్వాసులారా! మీరు మిమ్మల్ని, మీ కుటుంబసభ్యులనూ మానవులు, రాళ్ళు ఇంధనం కాబోయే అగ్ని నుండి కాపాడుకోండి."

(దివ్య ఖుర్‌ఆన్- 66: 6)

6) కుటుంబ పెద్ద అయిన తండ్రి చనిపోతే అతని సంతానం అనాథలై అనేక కష్టాలు పడాల్సి వస్తుంది. వారి బంధువులే వారి సంపదను కాజేస్తారు. ఖుర్‌ఆన్‌లో అనాథల పట్ల సద్భావంతో మెలగమని, వారి అవసరాలను తీర్చమని, వారి సంపదను అక్రమంగా స్వాహా చేయకండి అని ఆజ్ఞాపించబడింది. "పరలోక శిక్షను, బహుమానాన్ని తిరస్కరించే వ్యక్తిని నీవు చూశావా? అతడే అనాథులను కసరికొట్టేవాడు.." (దివ్య ఖుర్‌ఆన్- 107: 1,2)


"అనాథల ఆస్తిని వారికి తిరిగి ఇవ్వండి. వారి మంచి వస్తువులను మీ చెడ్డ వస్తువులతో మార్చకండి. వారి ఆస్తిని మీ ఆస్తితో కలిపి కబళించకండి. ఇది మహాపాపం." (దివ్య ఖుర్‌ఆన్- 4: 2)

7) బంధువుల పట్ల సత్ప్రవర్తన కలిగి ఉండమని ఖుర్‌ఆన్ బోధిస్తుంది. భార్యాభర్తలు ఇరువురిపై, ఇరువురి బంధువుల పట్ల కారుణ్యం, సత్ప్రవర్తన, సహాయ సహకారాలు కలిగి ఉండాలి. "వారి వైఖరి ఎలా ఉంటుందంటే, స్థిరపరచండి అని అల్లాహ్ ఆదేశించిన సంబంధాలను స్థిరపరుస్తారు." (దివ్య ఖుర్‌ఆన్- 13: 21). బంధుత్వాలను త్రెంచుకోవడాన్ని అల్లాహ్ ఇష్టపడడు.

8) భార్యాభర్తల మధ్య గొడవలు ఎక్కువై, పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉంటే మర్యాదపూర్వకంగా విడాకులు తీసుకోమని ఖుర్‌ఆన్ బోధిస్తుంది. సూరె బఖరాలోని 227-242 ఆయత్‌లలో స్పష్టంగా తలాఖ్‌కు సంబంధించిన విషయాలను, తలాఖ్ పద్ధతిని, ఇద్దత్‌ను పేర్కొనటం జరిగింది.

9) ఖుర్‌ఆన్‌లో వారసత్వ పంపిణీ గురించిన ఆదేశాలు ప్రత్యేకంగా విడివిడిగా దేనికది ప్రస్తావించబడి ఉంది. నమాజ్, జకాత్, హజ్, రోజా వంటి ప్రధాన ఆరాధనలను గురించి కేవలం ఆదేశాలను గురించి మాత్రమే ఖుర్‌ఆన్ చెబుతోంది. అవి ఎలా చెయ్యాలి, వాటిలో ఫర్జ్, సున్నత్, నఫిల్ వాటి లెక్కలు అన్నీ దైవప్రవక్త(స) బోధించారు. కానీ వారసత్వం గురించి లెక్కలను ఖుర్‌ఆన్ స్వయంగా తెలుపుతుంది. వారసత్వ సంపదలో స్త్రీ, పురుషులిద్దరికీ హక్కులు కల్పించటం జరిగింది. సూరె నిసాలోని 7-12 వరకు ఆస్తి పంపకాల గురించి స్పష్టంగా ఉంది.

10) గృహస్థ జీవనానికి సంబంధించిన అనేక ఆదేశాలను ఖుర్‌ఆన్ స్పష్టంగా పేర్కొంటుంది. భార్యాభర్తల హక్కులు, నికాహ్, మహర్, తలాఖ్, ఆస్తి పంపకాలు, బంధువుల హక్కులు, తల్లిదండ్రుల పట్ల సత్ప్రవర్తన, అనాథల పట్ల మంచి వ్యవహారశైలి, ఇంట్లో ఎలా ప్రవేశించాలి, ఇంటి వాతావరణం, ఇటువంటివన్నీ ఉన్నాయి. "ఇవి అల్లాహ్ విధించిన హద్దులు. అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ విధేయత చూపేవాణ్ణి అల్లాహ్, క్రింద సెలయేళ్ళు ప్రవహించే ఉద్యాన వనాలలో ప్రవేశింపజేస్తాడు. ఆ వనాలలో అతడు కలకాలం ఉంటాడు. అసలు ఇదే గొప్ప సాఫల్యం. అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ అవిధేయత చూపుతూ అల్లాహ్ విధించిన హద్దులను అతిక్రమించేవాణ్ణి అల్లాహ్ అగ్నిలో పడవే స్తాడు. అందులో అతడు సదా ఉంటాడు, అతనికి మిక్కిలి అవమానకరమైన శిక్ష పడుతుంది." (దివ్య ఖుర్‌ఆన్-4: 13,14) ❖








- నూర్ బాషా రహంతుల్లా
విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలక్టర్

మదనపల్లెలో క్షుద్రపూజలు చేసే విద్యావంతులైన తల్లి దండ్రులు తాము కని పెంచిన ఇద్దరు ఆడపిల్లలను దారుణంగా, క్రూరంగా చంపారు. చంపిన వారిలో పశ్చాత్తాపం లేకపోగా మానసిక రోగుల్లాగా పిల్లలు మళ్లీ బతికొస్తారంటున్నారు. వారం రోజులుగా ఇంట్లో మంత్రగాడితో క్షుద్రపూజలు చేయించారు. ముగ్గురూ నగ్నంగా ఇంట్లో పూజలు చేశారు. ముగ్గు తొక్కినప్పటి నుంచి కూతురిలో మనోదుర్భలం వచ్చిందన్నారు. దయ్యం వీడుతుందంటూ కూతురిని తల్లి డంబెల్‌తో కొట్టి చంపింది. చెల్లి ఆత్మను తెస్తాను నన్నూ చంపమ్మా అన్నదట పెద్దమ్మాయి. నేనే పార్వతిని.. కాళికను. బిడ్డలిద్దరూ పుణ్య లోకాల్లో ఉన్నారు. వారిని బయటకు తీసుకొస్తానంటూ అరిచిందట తల్లి. ఆధ్యాత్మిక మూఢత్వమే వారి ప్రాణాలు తీసింది! అన్ని మతాలలోను మూఢనమ్మకాలు చదువుకున్న వాళ్లలో కూడా తీవ్రంగా వ్యాపించాయి. నూనెలు తావీజుల స్థాయి దాటిపోయింది.

ప్రక్క రాష్ట్రం కర్ణాటక మూఢ నమ్మకాలు, అమానవీయ సాంఘిక చర్యలు, చేతబడి నివారణ, నిర్మూలన బిల్లును 2017 లోనే తెచ్చింది. జాతీయ మహిళా కమిషన్ సూచనతో ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, బిహార్, అసోం, మహారాష్ట్రలు మూఢనమ్మకాల్ని నిరోధించే చట్టాల్ని ప్రవేశపెట్టాయి. భారత రాజ్యాంగంలోని 51-A(h) పౌరుల ప్రాథమిక విధుల ప్రకారం "ప్రతి పౌరుడు ఇతరులలో శాస్త్రీయ దృష్టినీ, మానవతా వాదాన్నీ, పరిశోధనాసక్తినీ, సంస్కరణాభిలాషను పెంపొందించేందుకు కృషి చేయాలి." మూఢ, అనాగరిక విశ్వాసాలకు వ్యతిరేకంగా పౌరులందరూ ప్రచారం చేయాలి. నిష్కారణంగా నరేంద్ర ధబోల్కర్, కల్బుర్గీ, పన్సారే, గౌరీ లంకేశ్ లాంటి మేధావులను మూఢనమ్మకాల దుండగులు హతమార్చారు. జయలలిత, బీజేపీ మీద విపక్షాలు చేతబడి చేయించారని ఎంపీ ప్రజ్ఞాసింఘ్ లాంటివారు వాపోతే దమ్ముంటే నాపైన చేతబడి చేయండని మంత్రి కామినేని శ్రీనివాస్ సవాలు విసిరారు. నేటికీ కొందరు మోసగాళ్ళు మంత్రాలతోనే రోగాలు నయం చేస్తామనీ, ఎలాంటి పరికరాలూ లేకుండా ఒట్టి చేతులతోనే శస్త్ర చికిత్సలు చేసి శరీరంలోని కణుతులను తీసేస్తామని మోసం చేస్తున్నారు. దెయ్యం విడిపిస్తామంటూ జనాన్ని చిత్రహింసలకు గురిచేయడం, గుప్తనిధుల కోసం నరబలులూ, క్షుద్రపూజలు చేయడం, నగ్న పూజలు, గర్భంలోని శిశువు ఆడపిల్ల అయితే మగపిల్లవాడిగా మార్చేస్తామనే పేరుతో మోసాలు చేస్తున్నారు, అగ్నిగుండాలలో నడుస్తున్నారు. కొన్ని దేవాలయాలలో తమ దుష్కర్మలు నశిస్తాయనీ, రుగ్మతలు తొలగిపోతాయని చెప్పే 'మడె స్నాన', 'పులివిస్తర' (ఎంగిలాకు), దురాచారాన్ని నిషేధించినా బాణామతి చేతబడి పేరిట చాలా దౌర్జన్యాలు, మోసాలు జరుగుతున్నాయి. తమకు లొంగని కుటుంబాన్ని సాధించదలచిన గ్రామ పెత్తందార్లు ఆ అమాయకుల ఇండ్ల ముందు తమ మనుషులతో రాత్రికి రాత్రే పసుపు, కుంకుమ, నిమ్మకాయలు వేయించి, వారికి మంత్రగాళ్లనే ముద్రవేసి, వారి జుట్టు గొరిగించి, పళ్ళు ఊడగొట్టించి వీధుల్లో నగ్నంగా ఊరేగించి కసి తీర్చుకుంటున్నారు.

చేతబడి చేస్తామని కొందరు, ఇతరులు చేసిన చేతబడిని తిరగగొడతామనీ ఇంకొందరు సొమ్ముచేసుకుంటున్నారు. పక్షవాతం కారణంగా కోమాలో ఉన్నవారిని ఎవరో చేతబడి చేసిన కారణంగానే వారలా అయ్యారని చెబుతున్నారు. కొందరు అమ్మలూ, అవధూతలూ, బాబాలూ, స్వాములూ, రాజకీయ దళారులు, డేరా బాబాలు అత్యాచారాలు చేస్తున్నా, స్వామిజీలను ఆధ్యాత్మిక గురువులను, బాబాలను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. అత్యాచారి నిత్యానంద స్వామి పోలీసులకు చిక్కకుండా విదేశాలకు వెళ్లి ఏకంగా ఒక ద్వీపాన్నే కొనుగోలు చేసి అక్కడ స్వతంత్రంగా కైలాస రాజ్యాన్ని ఏర్పాటు చేస్తున్నాడు. మరికొందరు స్వామిజీలు, బాబాలు జైళ్లల్లో కాలం గడుపుతున్నారు. కొందరు చేసే వికృత చేష్టలు అమాయకుల ప్రాణాల మీదకు కూడా తెస్తున్నాయి. మంత్రాల పేరుతో రోగాలను నయం చేస్తామంటూ కింద పడేసి తొక్కుతున్నారు, వాతలు పెడుతున్నారు, ఇష్టానుసారంగా కొడుతున్నారు. కోరికలు లేని మనిషి లేడు. కోరికలు పెరుగుతూనే ఉంటాయి. రకరకాల కోరికలతో మనశ్శాంతి కోసం ఇంగ్లీషు మాట్లాడే స్వామీజీలను బాబాలను ఆశ్రయిస్తున్నారు. భైరవకోనలో గుప్తనిధుల కోసం అమావాస్య నాడు క్షుద్రపూజలు నిర్వహిస్తున్నవారిని పోలీసులు పట్టుకున్నారు. ఆలయ అధికారిని సస్పెండ్ చేశారు. కదిరి కొర్తికోటలో క్షుద్ర పూజలు చేస్తూ ముగ్గురిని బలి ఇచ్చారు. చేతబడులు క్షుద్ర పూజలతో దేశంలో వేల హత్యలు జరిగాయి. పుత్రసంతానం కోసం చిన్నారులను బలి ఇవ్వాలన్న భూతవైద్యుడి సలహాతో పసికందులను పొట్టనపెట్టుకున్నారు. భార్య ఆరోగ్యం కోసం, పక్షవాతం నయమౌతుందని, కొడుకు పుట్టాలనే ఆశతో యాగం చేసి మరీ పసిపాపలను బలి ఇచ్చారు. కొత్త ప్రాక్లైయినర్‌కు నరబలి, గంగాలమ్మ తల్లికి ఒక మహిళను బలిచ్చారు. అత్యాచారం చేసిన తరువాత మహిళలను తగలబెడుతున్నారు. క్షుద్రపూజలు బలుల నివారణపై జాతీయ స్థాయిలో చట్టం కోసం కేంద్రమూ సన్నాహాలు చేసింది. అన్ని రాష్ట్రాలకూ లేఖలు రాసింది. క్షుద్ర పూజలు చేస్తామంటూ వచ్చి ఇంట్లో సొమ్మంతా దోచుకుపోయిన దొంగలను పట్టుకోటానికి కూడా పోలీసులు తటపటాయిస్తు న్నారు. దీనిపై ప్రత్యేక చట్టం లేనందున పోలీసులు కూడా దీన్ని నేరం కింద పరిగణించలేక పోతున్నారు. బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే, క్షుద్రపూజలు చేసినవారిపై కేవలం మోసం కేసు మాత్రమే పెట్టగలుగుతున్నారు. గతంలో కొంత మంది ఎంపీలు మాత్రం ప్రజలు ఇంతలా మోసపోతున్నా, బాధ పడుతున్నా ఎందుకు చట్టం తేలేదని ప్రశ్నించారు. ఇంకా బిల్లు రావాలి. దేవుళ్లకు, దెయ్యాలకు బలులిస్తే తమ కోరికలు నెరవేరుతాయని ఇప్పటికీ కొంతమంది జనం నేర మనస్తత్వంతో నమ్ముతున్నారు. జంతువుల కన్నా నరబలి ఇస్తే తమ కోరికలు నెరవేరుతాయనే మూఢత్వంతో ఉన్నారు. మనిషిలో శాస్త్రీయ దృక్పథం పెరగాలి. ఇలాంటి బలుల మూఢత్వాన్ని తిప్పికొట్టాలి. మూఢ విశ్వాసాలు తాము చేస్తున్నది ఏమిటో కూడా తెలియనంతగా మనిషిని లొంగ దీసుకుంటాయి. ఇలాంటి అమానుష చర్యలు తప్పుకావని, ఫలానా గ్రంథంలో ఉంది, ఫలానా శాస్త్రంలో ఉంది అంటూ సమర్థించుకునే మానసిక స్థితి వారిలో ఉంటుంది. శాస్త్రవేత్తలు శ్రీహరికోట చంద్రయాన్ గురించి తిరుపతి, శ్రీరంగం వెళ్లి గొప్పగా చెబుతున్నారు. కొందరు ఈనాటికీ గోమూత్రం, రంగురాళ్లు, వాస్తు, కొండదొరల జోస్యాలు సినిమాలు, టివి సీరియళ్లలో మానవాతీత పరలోక పరకాయ ప్రవేశాలు, మూఢత్వ భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారు. సత్యలోకం వచ్చిందనీ, శవాలు గంతు లేస్తాయనీ బాబాలు చెబితే నమ్ముతున్నారు. పహాడీషరీఫ్‌లో ఆవు కూడా చెలరేగి కొందరిపై దాడి చేసిందట. మానసికంగా చెలరేగితే దివ్య పశువులూ మనిషికి హానిచేస్తాయని గ్రహించాలి. పిల్లలకు దిష్టితీసి వెంట్రుకల తాళ్లు తాయెత్తులు కట్టి పసి వయసు నుండే మూఢ నమ్మ కాలకు అలవాటు చేస్తున్నారు. మంత్రగత్తెలను, మంత్ర గాళ్ళను కొట్టిచంపుతున్నారు. మదనపల్లి సంఘటన చూశాకనైనా జంతుబలి, నరబలి, మూఢత్వ నిర్మూలనకు చట్టం తేవాలి. విజ్ఞానులతో నిండిన దేశాభివృద్ధి కోసం మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా చదువులు రావాలి.

❖

**'గీటురాయి'లో వ్యాసాలు రాసే మిత్రులు ఖుర్‌ఆన్ ఆయత్‌లను కోట్ చేస్తున్నప్పుడు "దివ్యఖుర్‌ఆన్" అనువాదం నుండి కోట్ చేయగలరని మనవి. కొందరు స్వయంగా అనువదిస్తూ పెద్ద తప్పు చేస్తున్నారు. ఈ విధానం మానుకోగలరని కోరుతున్నాము.**

## కథ

- అబ్దుల్ సత్తార్, మహబూబాబాద్



# ఆదర్శ కుటుంబం

"**అమ్మా!** నే వచ్చేస్తున్నా! ఇక్కడ ఓ క్షణమైనా భరించలేకుండా వున్నాను.. మీ అల్లుడి పోరు రోజురోజుకి మరీ ఎక్కువై పోతుంది. మన స్టేటస్‌కు తగ్గ సంబంధం కాదిది. మొన్న మా ఫ్రెండ్ బర్త్‌డేకు నేను ఒక డ్రెస్ సెలెక్ట్ చేస్తే ఎక్కువ ధర వుందని... కేవలం ఐదువేల చీప్ క్వాలిటీ డ్రెస్ ఇప్పించాడు. అలాగే నిన్న చిన్నప్పటి నా క్లాస్‌మేట్ ఇంట్లో ఫంక్షన్ వుంది, ఓ రింగ్ గిఫ్ట్‌గా తీసుకెళ్దామంటే పనికిమాలిన వాచ్ తీసుకెళ్దామన్నాడు. ఇలా ప్రతి విషయంలో డబ్బులకి కక్కుర్తి పడుతున్నాడు. రాత్రి నిలదీసి అడిగేసరికి మీ పుట్టింటికి వెళ్ళిపొమ్మని గద్దించాడు. ఇక నా వల్ల కాదు, వచ్చేస్తున్నాను" అంటూ సమస్యలను ఏకరువు పెడ్తూ ఫోన్ పెట్టేసింది అమ్రీన్.

అప్పుడే లంచ్‌కు వచ్చిన కరీం తన భార్యతో "ఏమోయ్, డల్‌గా ఉన్నావు? అమ్మాయి మళ్ళీ ఏమైనా ఫోన్ చేసిందా? మళ్ళీ ఏదైనా గొడవ జరిగిందా?" అంటూ ఆరా తీశాడు భార్య నజ్మాతో. "ఆ స్టేజ్ దాటింది. ఈసారి డైరెక్ట్ ఇంటికే వస్తానని చెప్పింది. బహుశా మరో గంటలో రావొచ్చు" అని బదులిచ్చింది నజ్మా భర్తతో.

◆◆◆

కరీం ఆర్ అండ్ బీ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ ఇంజనీర్. పట్నం మోజులో పడి హైదరాబాద్‌లో ఓ పెద్ద బంగళా, ఖరీదైన కారు... వెల్‌సెట్ అనుకున్నాడు కాని ఊహించని కుటుంబ సమస్యల్లో చిక్కుకుని మనశ్శాంతికి దూరమయ్యాడు.

◆◆◆

సమయం రాత్రి పది గంటలు... కరీంకు నిద్ర పట్టడం లేదు. భార్య నజ్మా కూడా నిద్రపట్టక అటూ ఇటూ మసలుతుంది. 'ఏమండీ.. నిద్ర పట్టడం లేదు కదా' అంటూ పలకరించింది భర్తను.

మళ్ళీ తనే మాటను పొడిగిస్తూ... 'పెద్దమ్మాయి... అత్త, ఆడపడుచు, భర్తతో గొడవపడి ఆర్నెల్ల నుండి ఇంటిపట్టునే ఉంది. ఇంతలో చిన్నమ్మాయి అనవసర డాంబికాలకు పోయి అది కూడా వచ్చేసింది. ఇద్దరు పెళ్ళైన అమ్మాయిలు ఇంట్లో ఉండడంతో అబ్బాయికి సంబంధాలు రావడం లేదు. వాడిక్కూడా పెళ్ళి వయసు దాటుతుంది. ఏమో అంతా చికాకులు'... అంటూ రోదించడం మొదలెట్టింది నజ్మా. ఇంతలో ఫోన్ మోగిన శబ్దం... 'అస్సలాము అలైకుమ్ తమ్ముడూ.. బాగున్నావా? పిల్లలెలా ఉన్నారు? వచ్చే ఆదివారం చిన్నమ్మాయి పెళ్ళి.. ఈ ఒక్క పెళ్ళయితే నా బాధ్యత తీరిపోతుంది. అంతా ఆ అల్లాహ్ కృప. తప్పకుండా రెండు రోజుల ముందే రావాలి. అబ్బాయి వాళ్ళది మంచి సంప్రదాయ కుటుంబం. వెడ్డింగ్ కార్డ్స్ కూడా ప్రింట్ చేయడం లేదు. అందుకే ఫోన్‌లో చెప్తున్నా..." అంటూ ఫోన్ కట్టేశాడు కరీం అన్నయ్య అలీం.

అన్న గొంతులో ధ్వనించిన ఆ నిండుదనం, ఆప్యాయత, సంతృప్తి కరమైన జీవితానికి అద్దంపట్టేలా ఆ మాటతీరు కరీం గుండెల్ని తాకాయి. ఓ క్షణం గతంలోకి జారిపోయాడు.

◆◆◆

అలీం... మంచి టైలర్ ఆ గ్రామంలో. ఐదుగురు ఆడపిల్లలతో పాటు ఓ కొడుకు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు గతించగా తమ్ముడు కరీంకు ఉన్నత చదువులు చదివించి ఇంజనీర్ ఉద్యోగం వచ్చేదాకా పెంచి పెళ్ళి చేశాడు. ధనవంతురాలైన కుటుంబం నుంచి వచ్చిన కరీం భార్య, భర్తను ఎలాగో మెప్పించి హైదరాబాద్‌కు మకాం మార్పించడంలో కృతకృత్యురాలయింది.

కరీం కూడా అన్నతో వుంటే గంపెడు సంసార బాధ్యతలు తాను కూడా ఎక్కడ మోయాల్సి వస్తుందోనని కాస్తంత స్వార్థబుద్ధితో భార్య మాటకు తలొగ్గాడు. చివరకు అన్నయ్యను కలవడానికి కూడా సంవత్సరాలు గడిచిపోయేవి. ఏవేవో సాకులు చెప్పి పెళ్ళిళ్ళకు కూడా రాకుండా ఉండిపోయాడు. చూస్తుండగానే చివరి కూతురి పెళ్ళికి అన్నయ్య ఆహ్వానం పలికాడు. ఇలా ఆలోచనల సుడిగుండాల్లోనే గతంలోంచి నిద్రలోకి జారుకున్నాడు కరీం.

◆◆◆

మర్నాడు ఉదయం టిఫిన్ చేస్తూ కరీం "ఏమోయ్.. ఇంట్లో అన్నీ సమస్యలు.. కొంత రిలాక్స్ అవడానికి పెళ్ళికి వెళదాం. ఊరికి వెళ్ళక ఎన్నో సంవత్సరాలైంది. ఆఫీస్‌కు వెళ్ళి సెలవు పెట్టి వస్తాను.." అన్న మాటలు విని సైగలతోనే ఓ.కే అన్నారు అందరూ.

◆◆◆

జానకిపురం... పల్లె ప్రకృతికి, ఆధునికతకు వారధిలా ఉంది ఆ గ్రామం. ఎన్నో సంవత్సరాల తర్వాత వచ్చిన కరీంకు తన చిన్ననాట చదువుకున్న, ఆడుకున్న సంఘటనలు గుర్తుకు వస్తున్నాయి. విశాలమైన స్థలంలో పెంకుటిల్లు, చుట్టూ వేపచెట్లు, ఓ మామిడి చెట్టు, నిమ్మచెట్టు, చేతబావి... ఇలా చూడగానే ఆ ఇంటిని ఆనంద నిలయంగా పేరు పెట్టవచ్చు. కరీం పిల్లల్తో సహా లోపలికి రావడం చూసి ఎంతో ఉత్సాహంతో కరీం వదిన ఆహ్వానిస్తూ తోటి కోడల్ని ఆలింగనంతో గుండెల్ని హత్తుకుంది. పిల్లలందరూ 'బాబాయ్' అంటూ చుట్టుముట్టారు. అప్పుడే మగ్రిబ్ నమాజ్‌కు వెళ్ళి వచ్చిన అలీం.. తమ్ముడ్ని గట్టిగా కౌగిలించుకున్నాడు. ఒరేయ్ తమ్ముడు... ఇదిగో... వీరు మన అల్లుళ్ళు, మనవలు, మనవరాళ్ళు అంటూ ఒక్కొక్కర్ని పరిచయం చేస్తూ పోయాడు. ఇల్లంతా సందడి. భోజనం- ఇషా నమాజ్- తర్వాత సైరన్ మ్రోగినట్లుగా.. అందరూ తరగతి గదిలో మాదిరిగా క్రమశిక్షణతో కూర్చున్నారు. అలీం... ఖుర్‌ఆన్ పాఠం, భార్య హదీస్, అలాగే కూతుళ్ళు ఒక్కొక్కరూ ఒక్కో సహాబా చరిత్ర... ఇలా ధార్మిక విషయాలు పంచుకోవడం కరీంకు, అతని భార్యాపిల్లలకు ఓ వింత అనుభూతిని కలిగించింది.

◆◆◆

చూస్తుండగానే నాల్గురోజులు క్షణంలా గడిచిపోయాయి. చిన్న కూతురి వివాహం, బంధువుల మధ్య ఎంతో ఘనంగా జరగడం, కూతుళ్ళు, అల్లుళ్ళు, చిన్నా పెద్దా తేడా లేకుండా అంతా ఒకే కుటుంబంలా కలిసి ఉండడం.. దానిక్కావలసిన ధార్మిక జ్ఞానం, క్రమశిక్షణ, నైతిక విలువలు.. అంతేకాని డబ్బు కాదన్న విషయం జ్ఞానోదయమైంది కరీంకు, అతని భార్య, పిల్లలకు.

'బడే బా... మేం వెళ్ళిన తర్వాత మా అత్తామామలతో మాట్లాడి పిక్నిక్ అరేంజ్ చేస్తాం. మీరందరూ తప్పక రావాలి... అంటూ ముక్తకంఠంతో కరీం కూతుళ్ళిద్దరూ చెప్తుంటే.. నజ్మా కళ్ళు ఆనందభాష్పాలు రాల్చాయి.

❖

## కన్నవారి విలువ తెలుసుకో..

నేడు తల్లిదండ్రులు పిల్లలకు భారమయ్యారు. తండ్రి మాట పాతకాలపు మాటలయ్యాయి. మనవలు, మనవరాళ్ళు దూరం నుండి మాట్లాడాలి. ముద్దాడితే రోగాలొస్తాయి. పిన్నీ, బాబాయిలు, అత్తామామలు, ఆంటీ అంకుల్‌గా మారి దూరమయ్యారు. పక్కింటివారితో మాట్లాడే సమయం లేదు. కన్నవారిని తిన్నారా... అని అడిగే సంస్కారం లేదు. టచ్ ఫోన్‌లో వేలు త్రిప్పుతూ ప్రపంచమంతా చూడగలిగే ఓ మానవుడా! విలువలు మరిచావా.. సంస్కారం వదిలేశావా?!

తొమ్మిది నెలలు కడుపులో మోసిన నీ తల్లి, నువ్వు లోపల తన్నుతున్నప్పుడు, నీ వల్ల మందులు, సూదులు తీసుకుంటున్నప్పుడు అనుకోలేదు నా బిడ్డ నాకు భారమని, ఇల్లంతా సర్ది, నువ్వు బాత్‌రూమ్ చేసి ఒళ్ళంతా పూసుకొని అన్ని వస్తువులు చిందర వందర చేసినప్పుడు అనుకోలేదు నా బిడ్డను ఎక్కడికైనా పంపేద్దామని.

బడికి వెళ్ళనని మారాం చేసినా, చాక్లెట్లు, బిస్కెట్లు కావాలని ఏడ్చినా, అందరితో సమానంగా ఉండాలని విలాసాలను తన శ్రమతో, నీ మనసుని తన మాటతో సముదాయించి ఉన్నత వ్యక్తిగా మలిచిన నాన్న అనుకోలేదు నా కొడుకు... ఇలా ఎదుగుతాడని.

అమ్మమ్మ తన చేతి సున్నుండలు తినిపించి నిన్ను బలవంతుడిని చేద్దామని, తాతయ్య బొమ్మలు తెచ్చి, కథలు చెప్పి నిన్ను నిద్రపుచ్చినప్పుడు అనుకోలేదు నా మనవడు తన అమ్మా నాన్న చేతులు మురికయ్యాయని, ఆపదొస్తే ఆదుకునే పిన్నీ-బాబాయ్‌లు, మామ, పెదనాన్నలు, అత్తమ్మ అందరూ తమ సమయాన్ని వదిలి నీ చిట్టి చిట్టి మాటలకు మురిసి నీ చేష్టలకు నవ్వులు చిందిస్తూ అనుకోలేదు నేడు నీ వద్ద సమయం లేదని, నీ పిల్లల స్థోమతను చూపించి ఆంటీ, అంకుల్ అనే రోజులొస్తాయని. చుట్టాలు లేరు, స్నేహితులు లేరు, మనం.. మనం అంటూ మనశ్శాంతి వెతికే ఓ మనిషి మేలుకో, ఇకనైనా మేలుకో...

– అర్షియా రుబీన్

# కుటుంబ బలం



రైహాన్

బంధాలు, బంధుత్వాలు అల్లాహ్ ప్రసాదించిన గొప్ప వరం. బంధుత్వాలు, కుటుంబాలు మానవజాతి ప్రత్యేకత. మరే జాతిలోనూ ఇలాంటి బంధాలు మనకు కానరావు. పిన్ని, బాబాయ్, పెద్దనాన్న, మామయ్య, అత్తయ్య తదితర బంధాలు పటిష్టబంధాలు. ఈ బంధాల కారణంగానే మనిషి తనను తాను చాలా బలవంతుడినని భావిస్తాడు. దీని అంచనా మనిషికి అన్ని సౌకర్యాలు అందుబాటు ఉన్నప్పు డయితే అంతగా అవదు. మనిషికి ఆరోగ్యం, డబ్బు ఉన్నప్పుడు అతనికి ఎవరి అవసరమూ లేదు అని అనిపించవచ్చు. కాని కష్టకాలంలో, ఆపదలు వచ్చినప్పుడు మనిషికి బంధువులు బంధుత్వాలు ఎంత అవసరమో తెలిసి వస్తాయి. ఆ బంధాలే మనిషికి శక్తినిస్తాయి. మనిషికి బలాన్నిచ్చే ఇలాంటి బంధాలకు మనిషి విలువ ఇవ్వాలి. బంధువుల పట్ల మంచిగా మెలగడం, కుటుంబాన్ని పరిరక్షించడం, బంధువుల హక్కులను నిర్వర్తించడం ప్రతి మనిషీ తప్పనిసరిగా చేయాలి. ఎందుకంటే వీటి గురించి రేపు ప్రళయ దినం నాడు ప్రతి ఒక్కరూ జవాబు చెప్పుకోవాల్సి ఉంటుంది కూడాను. దాంతోపాటే దీన్ని ఒక పెద్ద పరీక్షగా కూడా భావించాలి. మనం గనక కుటుంబాన్ని ఒక పరీక్షగా చూస్తే బంధుత్వాలను నెరపడం చాలా సులువవుతుంది. ప్రశ్నాపత్రాలు ఒక్కోసారి కష్టంగా వస్తే ఒక్కోసారి సరళంగా కూడా వస్తాయి. ఎలా వచ్చినా సరే మనం ఆ ప్రశ్నాపత్రానికి సమాధానమయితే ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతి మనిషికి ఈ బంధుత్వాలకు సంబంధించిన ప్రశ్నాపత్రం వేరువేరుగా ఉంటుంది. అంటే కొందరి బంధువులు వారి పట్ల మంచిగా మెలగుతారు, వారి పట్ల సానుభూతి చూపుతారు. వారికి చేదుడువాదోడుగా ఉంటారు. అలాంటప్పుడు వారితో బంధుత్వాలను నెరపడం చాలా సులభతరం అవుతుంది. కాని కొందరి బంధువులు అసలు దగ్గరకు రానీయరు. వారి మనస్తత్వం, స్వభావం చాలా వేరుగా ఉంటుంది. మనం వారితో ఎంత మంచిగా ఉన్నప్పటికీ వారు మనతో కయ్యానికి కాలు దువ్వుతుంటారు. ఇలాంటి వారితోనే మనం ఎక్కువగా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఇలాంటి బంధువులు ఉన్నవారు కొంచెం సహనం, ఓర్పుతో మెలగాలి. నాకు ఇలాంటి కఠిన ప్రశ్నాపత్రమే వచ్చింది. దాన్ని ఎలాగయినా వ్రాయాలి. దాని ద్వారానే అల్లాహ్‌ను సంతోష పెట్టాలి అని భావించి ముందుకు సాగాలి.

మనిషి ముఖ్యంగా బంధాలను వర్గీకరిస్తాడు. కొన్ని బంధాలు ప్రేమ పూర్వకమయినవి, కొన్ని టెన్షన్‌తో కూడుకున్నవి, కొన్ని విద్వేషాలతో కూడుకున్నవని భావించి దాని ప్రకారం నడుచు కుంటాడు. దాని వల్ల అతను సంబంధాలను సరిగ్గా నిర్వర్తించ లేకపోతాడు. తల్లిదండ్రులతో గల సంబంధం ప్రేమపూర్వక మయినది అని భావించి వారితో ఎప్పుడు ప్రేమగా మెలగు తాడు. బంధువులతో ప్రేమపూర్వకంగా మెలగాలి, అందరినీ గౌరవించాలి, అందరినీ ఆదరించాలి అని ప్రతి ఒక్కరూ భావించాలి. దానివల్ల అందరి వైఖరి మారిపోతుంది. అప్పుడు అందరితో మంచి సంబంధాలు నెరపవచ్చు. దాని వల్ల ఒక పటిష్ట కుటుంబం రూపుదిద్దుకుటుంది.

మనిషి కుటుంబ సభ్యులను ప్రేమించాలి. చాలా ఎక్కువగా ప్రేమించడం నేర్చుకోవాలి. మనిషి వివాహం చేసుకున్న తరువాత ఎవరిని ప్రేమించాలనే విషయంలో సందేహం కలగకూడదు. తన కుటుంబం వారిని ప్రేమించాలా? తల్లిని ప్రేమించాలా? భార్యను ప్రేమించాలా? పుట్టింటి వారితో బాగుండాలా? అత్తింటి వారితో బాగుండాలా? ఇలాంటి ప్రశ్నే తలెత్తకూడదు. నేను అందరికీ న్యాయం చేయాలి అని మాత్రమే ఆలోచించాలి. న్యాయాన్ని పటిష్టంగా పట్టుకోవాలి. నేను అందరినీ ప్రేమించాలి అని భావించాలి. ఇప్పటి వరకు ఉన్న నా బంధువులను,

వివాహానంతరం అయ్యే బంధువులను అందరినీ గౌరవించాలి. కనుక కుటుంబంలోని ప్రతి ఒక్కరితో పటిష్ట సంబంధాలు ఏర్పరచుకోవాలి. లేదంటే కొందరికి దగ్గరయి మరి కొందరికి దూరం కావాల్సి వస్తుంది అనుకోవాలి.

ఒక ఇంట్లో ఎంతమంది కుటుంబ సభ్యులున్నారో వారందరూ ఆ ఇంటి పనులను సమానంగా పంచుకోవాలి. అందరూ సమంగా శ్రమించాలి. సమంగా ఎంజాయ్ చేయాలి. సమంగా విశ్రాంతి కూడా పొందాలి. ఇంటి పనులు అందరూ పంచుకోవాలి. అందరికీ విశ్రాంతి లభించాలి. ఇది స్త్రీలకు వర్తిస్తుంది. పురుషులకూ వర్తిస్తుంది. ఇంట్లో ధన సంబంధ అవసరా లుంటాయి. ఇంట్లో సంపాదించే స్తోమత కలిగి ఉన్న ప్రతి ఒక్కరు- శారీరకంగా అయితే శారీరకంగా, మేధతో శ్రమించేవారు వారు మేధతో శ్రమించి సంపాదించాలి. కొందరు తక్కువగా సంపాదించేవారుంటారు, కొందరు ఎక్కువగా సంపాదించే వారుంటారు. కనుక ఎలాంటి విభేదాలు తలెత్తకుండా ఇంటి ఆర్థిక అవసరాలు తీర్చడంలో అందరూ భాగస్వాములవ్వాలి. అందరూ కలసి ఉన్నా వేరు వేరుగా ఉన్నా సరే అందరూ కుటుంబ బాధ్యతలను కంట్రిబ్యూట్ చేసుకోవాలి. వృద్ధ తల్లిదండ్రులుంటారు. వారి విషయంలో అందరూ సమంగా తమ బాధ్యతలను నెరవేర్చాలి. అన్నలుంటారు, తమ్ముళ్ళుంటారు; వారు ఎక్కువగా సంపాదించ లేరు. వాస్తవంగానే వారిలో అంత తెలివి ఉండదు, అలాంటి సందర్భంలో మిగతా వారందరూ అతనికి సహాయం చేయాలి.

అదేవిధంగా మహిళల విషయం కూడాను. సాధారణంగా మహిళల మధ్య పనుల విషయంలో విభేదాలు తలెత్తుతాయి. వాగ్వాదాలు జరుగుతాయి. దాంతో దూరాలు పెరుగుతాయి. అలాకాకుండా అందరూ కలసి కొన్ని నియమాలు పెట్టుకోవాలి. ఇంట్లో ఎన్ని పనులయితే ఉన్నాయో వాటిని ఇంటి సభ్యులందరూ కలసి పనులను పంచుకోవాలి. తలా ఒక పని చేయాలి. అందరూ కలిసి పని చేస్తే పనులు త్వరగా అవుతాయి. అందరికీ విశ్రాంతి దొరుకుతుంది. బాధ్యతలు అందరూ నెరవేరిస్తే కుంటుంబంలో దొరికే మాధుర్యం, సౌలభ్యంతో అందరూ లబ్ధి పొందవచ్చు. కొందరు పని చేయడం మరి కొందరు పని చేయక పోవడమనేది, కొందరు సంపాదించడం మరి కొందరు ఖాళీగా కూర్చోవడం అనేది అన్యాయం. ఆత్మగౌరవానికి, ఆత్మాభిమానానికి విరుద్ధం. కనుక కుటుంబంలో ఇలాంటిది ఎన్నడూ జరగకూడదు.

కుటుంబ విషయంలో మన అధికారాన్ని వేరే వారి మీద అస్సలు రుద్దకూడదు. కుటుంబం నుంచి ఎవరయినా వేరుకావాలనుకుంటే వారిని అడ్డుకోకూడదు. మన అభిప్రాయం వారిని గౌరవించే విధంగా ఉండాలి. వారి నిర్ణయాన్ని స్వాగతించాలి. వారి అభిప్రాయాన్ని విభేదించకూడదు. చాలా సున్నితంగా, సంస్కారవంతంగా వేరు కావాలి.

కుటుంబంలో పరస్పరం సలహా సంప్రదింపులు చేసుకునే వాతావరణం ఉండాలి. సంతానానికి తమ పెద్దలతో తల్లిదండ్రులతో సలహాలు తీసుకునే స్వేచ్ఛ ఉండాలి. ఎవరికయినా ఏదయినా సమస్య తలెత్తితే లేదా ఏదయినా పని చేయాల్సిన అవసరం ఏర్పడితే వారు కుటుంబ సభ్యులతో సంప్రదించే పరిస్థితి ఉండాలి. భార్యాభర్తలు కూడా ఏదయినా పని చేయాలనుకుంటే ఒకరికొకరు సంప్రదించాలి. పరస్పర అంగీకారం సంప్రదింపులతో పని చేస్తే అందులో ఏదయినా నష్టం జరిగినా, హాని కలిగినా ముందే దాని గురించి చర్చించారు కాబట్టి ఇరువురి మధ్య విభేదాలు తలెత్తవు. సలహా సంప్రదింపులు ఎంత ఎక్కువగా చేపడితే మనుషుల మధ్య అంతగానే సామీప్యత పెరుగుతుంది. అంతరాలు దూరమవుతాయి.

మరో విషయం ఉపకారం. కుటుంబ సభ్యులు పరస్పరం ఉపకార భావంతో మెలగాలి. ఖుర్ఆన్ అనేక సందర్భాలలో బంధువుల పట్ల ఉపకార భావంతో మెలగాలని పేర్కొంది. ఉపకారం అంటే మీపై మోపబడిన బాధ్యతల కంటే ఎక్కువగా నిర్వర్తించాలి. ఇతరుల పట్ల వ్యవహరించాల్సిన దానికంటే ఉత్తమంగా మెలగడం, ఇవ్వాల్సిన హక్కుల కంటే అధికంగా ఇవ్వడం, ఇతరుల పట్ల ఎక్కువ సానుభూతితో మెలగడం. దాని వల్ల ఇతరుల అవసరాలేమిటో తెలుస్తాయి. ఇతరుల భావాలు తెలిసి ఉంటాయి. కనుక వారికి అనుగుణంగా మెలిగే వీలుంటుంది. ఇంటి సభ్యుల్లో ఎవరిలోనయినా ఈ ఉపకార గుణం ఉంటే ఇంటి వాతావరణమంతా చాలా ఆహ్లాదకరంగా మారి పోతుంది. దాని వల్ల మొత్తం కుటుంబానికి ప్రయోజనం చేకూరుతుంది.

ఒక మంచి కుటుంబం నిర్మించాలనుకుంటే ఆ కుటుంబ సభ్యులు సహనగుణం, ఓర్పు, ఒకరిని భరించడం అనే లక్షణాలు కలిగి ఉండాలి. మీలో గనక సహనగుణం అనేది ఉంటే మీరు ఇంటి సభ్యులందరినీ కలిపి ముందుకు తీసుకువెళ్ళగలుగుతారు. వ్యక్తుల స్వభావం విభిన్న రకాలుగా ఉంటుంది. ఒకరు చాలా పరుషంగా మాట్లాడేవారుంటారు. వారు ఏదన్నా మాటంటే దాన్ని భరించే గుణం ఉండాలి. ఒకరు చాలా మౌనంగా ఉంటారు. వారి మౌనం కూడా ఎదుటివారికి గుచ్చుకుంటుంటుంది. అప్పుడు కూడా మనిషిలో సహనగుణం అనేది ఉంటే దాన్నీ మనిషి

భరిస్తాడు. మనిషిలో మంచీ ఉంటుంది. చెడు ఉంటుంది. మంచి ఉంటే దాన్ని ముందుంచుకోవాలి. చెడు ఉంటే దాన్ని భరిస్తూ ఉండాలి. పటిష్ట సమాజం ఏర్పడాలంటే మనవైపు బంధుత్వాలను గట్టిగా పట్టుకోవాలి. అంటే మనం మన వంతు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి. ఈ విషయంలో పెడధోరణి ఉండకూడదు. అంటే ఎదుటి వారు ఎలా వ్యవహరిస్తే నేను వారి పట్ల అలాగే వ్యవహరిస్తాను అని భావించినట్లయితే అది బంధుత్వాలను నెరవేర్చడంలో చాలా బలహీనమయిన వైఖరి అవుతుంది. బంధుత్వాలను పటిష్టంగా ఉంచాలంటే అనుసరించాల్సిన బలమైన విధానం ఎవరు నా పట్ల ఎలా వ్యవహరించినా సరే నేను మాత్రం వారి పట్ల మంచిగా మెలగుతాను, మంచిగా వ్యవహరిస్తాను అనుకుని ముందుకు సాగాలి. ఎదుటి వారు బంధుత్వ త్రాడును గట్టిగా పట్టుకున్నా పట్టుకోకున్నా మీరు బంధుత్వ త్రాడును గట్టిగా పట్టుకుంటే బంధుత్వ సంబంధాలను కొంత మేరకు నెట్టుకురావచ్చు. బంధుత్వ త్రాడును ఇరు వైపులా వదలిపెడితే బంధుత్వాలను కొనసాగించడమనేది సాధ్యం కాదు. ఎదుటివారు త్రాడును వదలిపెట్టినా మీరు బలంగా గనక పట్టుకుని ఉంటే ఎదుటి వారు తరువాతయినా దాన్ని గట్టిగా పట్టుకునే వీలుంటుంది. ❖

**- షేక్ అబ్దుల్ బాసిత్, కొత్తగూడెం**




**'బాబు** రూపాయికే స్వర్గం'.

ఇది బోగస్ కాదండోయ్. ఇది అక్షరాలా నిజం.

ఇంతకీ ఆ స్వర్గం ఒక్క రూపాయికే ఎలా లభిస్తుందో తెలిస్తే ఆశ్చర్యపోతారు.

అయ్యో! చౌకగా లభించే స్వర్గానికి ఇన్నాళ్ళు ఎందుకు కొనుక్కోలేకపోయామా? అని బాధపడటం కూడా ఖాయం.

నాయనా నీకు సలాం చేస్తాం. తొందరగా చెప్పి పుణ్యం కట్టుకో!

అయితే వినండి!

తీర్పు దినాన ఒక దాసుని ముందు ఉంచబడిన లెక్కలేనన్ని పుణ్యాలను చూసి ఓ వ్యక్తి ఆశ్చర్యపోతూ "ఓ దైవమా! నేను బ్రతికి ఉన్న కాలంలో ఇన్ని పుణ్యాలు చేసి ఎరుగను. మరి నా ఖాతాలో ఇన్ని పుణ్యాలు ఎలా వచ్చి చేరాయి" అని అడగ్గా

'ఓ నా దాసుడా! ఒకానొక సమయంలో నీ వద్ద కేవలం ఒకే ఒక్క దిర్హం మాత్రమే ఉంది. అప్పుడు దాని అవసరం నీకు, నీ కుటుంబానికి ఎంతగానో ఉంది. అప్పుడే ఒక వ్యక్తి వచ్చి అల్లాహ్ కోసం ఏదైనా దానం (సదఖా) చేయమని కోరగా, నీవు నీ గురించి కానీ, నీ కుటుంబం గురించి కానీ ఆలోచించకుండా ఆ దిర్హం అతనికి దానం చేసావు. అది ఆ వ్యక్తి చేతుల్లో పడక ముందే నేను దాన్ని నా చేతుల్లోకి తీసుకున్నాను. నాటి నుండి నేటి వరకు దాన్ని సంరక్షిస్తూ వచ్చాను. అది ఈ రోజు నీకు ఇన్ని పుణ్యాలుగా మార్చి ఇచ్చింది. ఈ పుణ్యాలే నేడు నిన్ను నరకాగ్ని నుంచి కాపాడి స్వర్గానికి తీసుకుని వెళ్ళడానికి ఉపయోగపడింది." అని అన్నాడు అల్లాహ్.

మిత్రులారా! చూసారా? తన అవసరం కన్నా పరుల అవసరానికి పనికొచ్చే ఒక్క దిర్హంకే, లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన పుణ్యానికి సమానంగా ప్రతిఫలం లభించింది. అంతకుమించి స్వర్గం లభించింది.

మనం చనిపోయాక సంపాదించిన సంపద ఇంటికే పరిమితం అవుతుంది. నా అనే వాళ్ళు ఖబరస్తాన్ వరకు వచ్చి మట్టిలో పూడ్చి వెనుతిరిగి వెళ్ళిపోతారు. చివరికి మిగిలేది మనం చేసుకున్న మంచి పనులే పుణ్యాల రూపంలో పనికి వస్తాయి. చేసే దానం సమాజం చూడాలని, పేరు ప్రఖ్యాతుల కోసం కాక కేవలం అల్లాహ్ కోసమే అయివుండాలి.

పరులు చూడాలని చేసే దానం పరలోకంలో పనికిరాదు.

చిత్తశుద్ధి కలిగి చేసిన పుణ్యంబు

కొంచెమైనను చాలు కొదువ కాదు

అన్నట్టు చేసిన పుణ్యం అది ఎంత చిన్నదైనా ఎనలేని లాభం కలుగుతుంది. ❖




## అజాన్ విని తన ప్రసంగాన్ని ఆపిన బాక్సర్ విజయేందర్



ఒకరి మత విశ్వాసాలను మరొకరు గౌరవించడం దేశంలోని ప్రతి పౌరుని బాధ్యత. దాంతో సమాజంలో సామరస్య వాతావరణం నెల కొంటుంది. దేశంలో రైతు నిరసనలకు మద్దతుగా మహా పంచాయత్‌లు నిర్వహిస్తున్నారు. తాజాగా ఉత్తరప్రదేశ్ బిజ్నూర్‌లోని చాంద్‌పూర్‌లో ఇటీవల కిసాన్ మహా పంచాయత్ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ప్రియాంక గాంధీ కూడా పాల్గొన్నారు. ఈ సమావేశంలో అంతర్జాతీయ బాక్సర్ విజయేందర్ ప్రసంగిస్తున్న సందర్భంలో అజాన్ శబ్దం వినబడటంతో ఆయన తన ప్రసంగాన్ని నిలిపివేసి మౌనం పాటించారు. అజాన్ పూర్తవగానే ఆయన మళ్ళీ తన ప్రసంగం ప్రారంభించారు. విజయేందర్ ఈ చర్య అక్కడి ఉన్న వారందరినీ ఎంతగానో ఆకట్టుకుంటుంది.

## అన్యాయానికి వ్యతిరేకంగా ఆశాకిరణం రైతు నిరసనలు

నూతన సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన ఉద్యమం అన్యాయానికి వ్యతిరేకంగా ఆశాకిరణంలా కనిపిస్తుందని మౌలానా సజ్జాద్ నోమానీ పేర్కొన్నారు. సింఘు సరిహద్దులో నిరసనలు తెలుపుతున్న రైతుల వద్దకు వెళ్ళి ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... దేశంలో అన్యాయాన్ని ఎదుర్కోడానికి ఎన్నో ఉద్యమాలు వచ్చాయని కాని ఈ ఉద్యమం చాలా ప్రత్యేకమన్నారు. దేశ ముస్లిములు రైతు చేస్తున్న పోరాటంలో తోడుగా ఉన్నారు. ముస్లిమ్ సముదాయం మీతో ఉన్నారన్న భరోసా నేను ఇస్తున్నాను అన్నారు. కరోనా మహమ్మారి వల్ల దేశం సంక్షోభంలో చిక్కుకుందని అలాంటి తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చట్టాలు తీసుకురావడం సరికాదన్నారు.

## కేరళలో సీఏఏ అమలు చేయము



కేరళలో సీఏఏను అమలు చేయబోమని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పష్టం చేశారు. దేశంలో కరోనా వ్యాక్సినేషన్ ప్రక్రియ ముగిసిన అనంతరం పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను అమలు చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన ప్రకటనపై ఆయన స్పందించారు. విజయన్ మాట్లాడుతూ.. 'ఓ రాష్ట్ర ప్రభుత్వంగా ఎందుకు అమలు చేయరని అమిత్‌షా అడుగుతున్నారని, ఎందుకు అమలు చేయాలో చెప్పాలని మేము అడుగుతున్నాం, దీనికి కేంద్రం సమాధానం చెప్పాలని' డిమాండ్ చేశారు.




ఆలిండియా ముస్లిమ్ పర్సనల్‌లా బోర్డు మహిళా విభాగం ఫిబ్రవరి 6-14 తేదీలలో హయా వీక్ (సిగ్గు, బిడియం అంశంపై వర్క్‌షాప్) నిర్వహించింది. సౌశీల్యతను ప్రోత్సహించే ఈ ఉద్యమంలో బాలికల కోసం పలు కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాసరచన, ప్రసంగ పోటీలు, నా హిజాబ్ కథా కమామీషు, హయా డ్రెస్ పోటీలు నిర్వహించారు. ఉర్దూ, ఆంగ్ల భాషల్లో పోటీలు నిర్వహించారు. ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, కర్నాటక, బిహార్, అసోం, తెలంగాణ, మహారాష్ట్ర, మణిపూర్, రాజస్థాన్, తమిళనాడు, కేరళ ప్రాంతాలలో బాలికలు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కాలంలో మహిళలు, బాలికలు, యువతులు ఏ విధంగా ఉండాలి, తమను తాము సమాజంలోని దౌష్ట్యాల నుంచి ఎలా కాపాడుకోవాలి అనే అంశాలపై ప్రముఖులు ప్రసంగించారు.

## భారత్ సహా 20 దేశాల ప్రయాణికులపై సౌదీ నిషేధం!

కరోనా కేసులు పెరిగిపోతున్న క్రమంలో సౌదీ అరేబియా దేశం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ సహా 20 దేశాల ప్రయాణికుల రాకపోకలపై తాత్కాలిక నిషేధం విధించినట్లు ఇండియన్ ఎంబసీ వెల్లడించింది. ఆ దేశం కరోనా కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇండియన్ ఎంబసీ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. ప్రయాణికుల రాకపోకలపై నిషేధం విధించిన దేశాలలో ఇండియాతోపాటు అర్జెంటీనా, యుఎఇ, జర్మనీ, అమెరికా, ఇండోనేషియా, ఐర్లాండ్, ఇటలీ, పాకిస్తాన్, బ్రెజిల్, పోర్చుగల్, యుకె, టర్కీ, సౌతాఫ్రికా, స్వీడన్, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, లెబనన్, ఈజిప్ట్, జపాన్ దేశాలు ఉన్నాయి.

## హజ్జ్ 2021కు సంబంధించి తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదు

హజ్జ్- 2021 సమీపిస్తున్న తరుణంలో యాత్ర విషయంలో ఇప్పటి వరకు ఏ నిర్ణయం ఇంకా తీసుకోలేదని హరమైన్ షరీఫైన్ కార్య నిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ అబ్దుల్ రహ్మాన్ అల్ సుదైస్ వెల్లడించారు. హజ్జ్ 2020లోనూ యాత్రికులకు పరిమిత సంఖ్యలోనే హజ్ చేసేందుకు అనుమతిచ్చామని గుర్తుచేశారు. "కరోనా మహమ్మారి సమయంలో మస్జిదుల్ హరామ్, మస్జిదె నబవీలో సౌదీ అరేబియా సేవలు" అనే అంశంపై ఒక సదస్సులో ప్రసంగించిన డాక్టర్ అబ్దుల్ రహ్మాన్ అల్- సుదైస్ ఈ వ్యాఖ్యలు చేశారు. కరోనా మహమ్మారి కాలంలో ఉమ్రా యాత్రను, మస్జిదె నబవీ సందర్శనను సుసాధ్యం చేసినందుకు ప్రపంచవ్యాప్తంగా సౌదీ అరేబియాకు ప్రశంసలు అందుతున్నాయని చెప్పుకొచ్చారు.

సర్వత్రా

## ఉమ్రా యాత్రికులకు సూచనలు

మక్కా ముకర్రమాకు ఉమ్రా యాత్ర కోసం వచ్చే పర్యాటకులను మస్జిదె హరామ్ జనరల్ సెక్యూరిటీ పలు సూచనలు చేసింది. ఈతమర్నా యాప్ ద్వారా ఉమ్రా, మస్జిదె హరామ్‌లో నమాజ్ చేసేందుకు అనుమతి పొందిన వారు నిర్ధారిత సమయం వరకు అక్కడ ఉండాలని కోరింది. అదేవిధంగా, ముందు జాగ్రత్త చర్యలు, భద్రతా చర్యలను పూర్తిగా పాటించాల్సిన అవసరాన్ని కూడా నొక్కిచెప్పింది. ఉమ్రా చేసేందుకు వచ్చేవారు తమ వెంట అనుమతి పత్రం ఉంచుకోవాలి. అది లేనిది అనుమతించేది లేదు. ఉమ్రా కోసం వచ్చేవారు ఈ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కావాల్సిన పత్రాలు అందులో లోడ్ చేయాలి. ఆ తరువాతనే అనుమతి లభిస్తుంది. అంతే కాకుండా సమయానికి ముందు వచ్చిన వారికి అనుమతించడం జరుగదు. యాత్ర సందర్భంగా భౌతిక దూరం పాటించాలి. సకాలంలో యాత్ర కార్యాలు ముగించుకోవాలి. నిర్ణీత వ్యవధి వరకే అనుమతి ఉంటుంది అని వెల్లడించింది.




## నజ్రాన్‌లో మస్జిదె అబూ బక్ర్ ఆధునీకరణ పనులు పూర్తి



సౌదీ అరేబియా ప్రభుత్వం అక్కడి పురాతన, చారిత్రక ప్రాముఖ్యత ఉన్న మస్జిద్‌ల ఆధునీకరణ పనులు చేపట్టింది. అందులో భాగంగా నజ్రాన్ ప్రాంతంలో ఉన్న మస్జిదె అబూ బక్ర్ మస్జిద్‌ను ఆధునీకరించే పనులు పూర్తయ్యాయని సంబంధిత అధికారి వెల్లడించారు. ఈ చారిత్రాత్మక మస్జిద్ నజ్రాన్‌లోని సార్ ప్రాంతంలో నుంది. ఇది ఈ ప్రాంతంలోని అతి ప్రాచీన మస్జిద్. పూర్వం చుట్టు ప్రక్క ప్రాంతాల వారు జుమా నమాజ్ కోసం ఇక్కడికి వచ్చేవారు. ఈ మస్జిద్‌లో బోధనలు, లెక్చర్‌లు కూడా జరిగేవి. స్థానికులు ఈ మస్జిద్‌లో విద్యాభ్యాస పనులు, ఖుర్ఆన్ నేర్పే పనులు కూడా నిర్వహించేవారు అని అధికారులు గుర్తుచేశారు.

# అభాగ్యానికి ఆనవాలు

ముజాహిద్ ఖాన్ ఉమరీ

**కడుపు** నిండినా, కళ్ళు నిండవు అంటుంటారు పెద్దలు. ఇది మనిషి బలహీనత. దేవుడు ప్రసాదించిన వాటిని కృతజ్ఞతా భావంతో చూస్తే మనసు సంతోషంతో నిండి పోతుంది. సంతోషంగా వుండాలంటే మనలోని కృతజ్ఞతా భావాన్ని పెంపొందించుకోవాలి.

**కృతజ్ఞతా భావం:**

అందుకే దివ్యఖుర్‌ఆన్ ఈ విధంగా తెలుపుతుంది: "మీరు గనక అల్లాహ్ అనుగ్రహాలను లెక్కించదలిస్తే లెక్కించ లేరు. నిజంగా మానవుడు అన్యాయపరుడు, కృత ఘ్నుడు." (ఇబ్రాహీం : 34)

కోటీశ్వరుడైన ఒక రోగగ్రస్తుని చూసి కవి గాలిబ్ ఇలా అన్నాడు:

**తంగ్ దస్తీ గర్ హైా గాలిబ్**
**తందురుస్తి హజార్ నిఅమత్ హై**

(పేదరికం వున్నా బాధలేదు, ఆరోగ్యముంటే అదే పది వేలు)

సంతోషంగా వుండటానికి ప్రవక్త(స)ఒక గొప్ప ఉపాయం చెప్పారు: "ఎల్లప్పుడూ మీకన్నా హీనస్థితిలో ఉన్న వారిని చూడండి. మీకన్నా ఉన్నత స్థితిలో ఉన్న వారి వంక చూడకండి. ఇదే మీ కొరకు శ్రేయస్కరం." (బుఖారీ).

సాధారణంగా అసంతృప్తి వల్లే మనిషి సంతోషానికి నోచుకోకుండా పోతాడు. సైకిల్ ఉన్న కాలంలో బైకు వుంటే బావుంటుందని, బైకు వస్తే కారుపై తిరగాలని ఆశిస్తాడు. కారు వస్తే ప్లేను ఎక్కలేదని అసంతృప్తి చెందు తాడు. ప్లేను ఎక్కాలన్న ఆశ తప్పు కాదు. కాని దేవుడు సైకిల్ దగ్గర నుండి కారు వరకు చేర్చినందుకు మనం ఎంత వరకు ఆయనకు కృతజ్ఞతలు తెలుపు కుంటున్నామో అనేది ఆలోచించాలి.

కృతజ్ఞులయి వుంటే మీకు మరిన్ని వరాలు అనుగ్రహిస్తా నని, కృతఘ్నులయిపోతే తన శిక్ష అత్యంత కఠినంగా వుంటుందని మీ ప్రభువు మిమ్మల్ని హెచ్చరించాడు. (ఇబ్రాహీం:6,7)

**అభివృద్ధి**

అయితే మనిషి ఎదగకూడదా!? అభివృద్ధిలోకి రాకూడదా? కష్టపడకూడదా? అనే సందేహం రావచ్చు. ఎందుకు ఎదగకూడదు? ప్రగతి శిఖరాలను చేరుకునే ఆశలే కాదు, పథకాలు కూడా తయారు చేయాలి, వాటిని సాధించటా నికి బాగా కష్టపడాలి. అయితే న్యాయం, సత్యం, నిజాయితీతో ఈ కృషిని సాగిస్తే మనిషికి భయాందోళ నలు ఉండవు. సంతోషంగా తన కృషిని కొనసాగించ గలడు. దాంతో పాటు దైవ కృప, సహాయం కూడా అవసరమని మనిషి నమ్ముతూ ఉండాలి.

"మా కొరకు సాధన చేసే వారికి మేము మార్గాలను చూపు తాము. నిశ్చయంగా అల్లాహ్ సజ్జనులతోపాటే ఉంటాడు". (అన్ కబూత్: 69)

ఈ లోకంలో సుఖసంతోషాలతో పాటు పరలోకంలో సాఫల్యం కోసం దుఆ (ప్రార్థన) చేయాలి. మచ్చుకు దివ్య ఖుర్‌ఆన్‌లోని ఒక ప్రార్థన ఇది:

"ప్రభూ! మాకు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ మంచిని ప్రసాదించు, మమ్మల్ని నరకయాతన నుండి రక్షించు" (బఖర: 201)

❖

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**